


ఉష్ణోగ్రత (అంచనా)

14-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	41	29
తెనాలి	40	28
నరసరావుపేట	39	27
బాపట్ల	39	29
రెంటచింతల	39	27
చీరాల	39	29

మరమ్మతులకు.. మోక్షం


తెనాలి : ఇరువైపులా కట్టలు, గోడలు దెబ్బతినిపోయి గండ్లుపడేలా ఉన్న డెల్టా కాల్వ

ఖరీఫ్ సమీపిస్తోంది. సాగునీటి కాల్వలు చూస్తే అధ్వానం. వేసవి ముగిసేనాటికి కాల్వల మరమ్మతులు చేపట్టాలి. గత నెలలో జిల్లాల వారీగా మరమ్మతులకు సంబంధించి అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. రోజులు గడు స్తున్నా నిధులపై ప్రభుత్వంలో స్పందన లేదు. ఈ పరిస్థితుల్లో మరమ్మతులు ఇక ఉండవని.. ఈ ఏడు కూడా కడ 'గండ్లు' తప్పవేమోనని ఆందోళనలో ఉన్న రైతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తూ తీపికబురు చెప్పింది. డెల్టా, నాగార్జునసాగర్ పరిధిలోని కాల్వల మరమ్మతులు సత్వరం చేపట్టాలని.. అవసరమైతే స్వల్పకాల టెండర్లు నిర్వహించి నెలాఖరుకల్లా పనులు పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఇక సాగునీటి కాల్వలకు మహర్దశ
- డెల్టాకు రూ.50 కోట్లు, సాగర్‌కు రూ.37 కోట్లు
- ఐదేళ్ల తర్వాత అడిగినన్ని నిధులు మంజూరు
- నెలాఖరులోపు పూర్తి చెయ్యాలని మంత్రి నిమ్మల ఆదేశం
- అవసరమైతే స్వల్పకాల టెండర్లు పిలవాలని అధికారులకు సూచన

తెనాలి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ప్రభు త్వం స్పందించి మరమ్మతులకు నిధులు విడుదల చేయ డంతో కృష్ణా డెల్టా, సాగర్ పరిధిలో కాల్వలకు మహర్దశ పట్టనుం ది. 'కాల్వల నిర్వహణకు కాసులు కావాలి' అనే శీర్షికన ఈ నెల 6న ప్రచురితమైన కథనంపై ప్రభుత్వం స్పందించింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కాల్వలకు నిధు లు మంజూరుపై నిర్ణయం తీసుకుంది. దీంతో అడిగినన్ని నిధులు మంజూరు చేసింది. ఈ నెలాఖరులోపు కాల్వల మరమ్మతులన్నీ పూర్తిచెయ్యాలని, అవసరమైతే స్వల్పకాల టెండర్లు పిలవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ అధికారులను కూడా ఆదేశించారు. దీంతో సాగునీటి సంఘాలు కాల్వల మరమ్మ తుల కోసం రంగంలోకి దిగాయి. అత్యవసర మరమ్మతుల ప్రాతిపదికన పనులను సాగునీటి సంఘాలు పూర్తిచేస్తా యనే నమ్మకాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా డెల్టా కింద గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో 5.71 లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయి. పల్నాడు జిల్లా పరి ధిలోని సాగర్ కాల్వలకింద భారీగానే సాగుభూములు ఉన్నాయి. వీటి పరిధిలోని కాల్వల మరమ్మతుల కోసం నీటి పారుదల శాఖ అధికారులు గత నెలలో ఓఅండ్ఎం నిధుల కింద రూ.25 కోట్లు చొప్పున రెండు డెల్టాల పరిధిలో రూ.50 కోట్ల అవసరమని ప్రతిపాదనలు పంపారు. అటు సాగర్ ఆయకట్టు పరిధి లోనూ రూ.37 కోట్లు, మైనర్ ఇరిగేషన్ అవసరాల కోసం రూ.55 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు నిధులు పూర్తిగా విడుదల కావడంతో పనులు సత్వరం చేపట్టే అవకాశం అధికారులకు లభిం చింది. అటు డెల్టా, ఇటు సాగర్ పరిధిలో టెండర్లు పిలవాల్సిన పనులు ఎక్కువగా లేనందున సకాలంలో సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో పూర్తిచేయడా నికి అధికారులు సిద్ధమవు తున్నారు. తొలుత అత్యవ సర పనులు పూర్తిచేస్తా మని అధికారులు ప్రకటిం చారు. ఖరీఫ్‌కు పనులు పూర్తి చేసి చివరి భూము లకు సైతం సాగునీటిని అం దించగలమన్న ఆశాభావా న్ని అధికారులు వ్యక్తం చేస్తు న్నారు.

వైసీపీ హయాంలో కడ'గండ్లు'

వైసీపీ హయాంలో సాగునీ టి కాల్వల బాగుకు నిధులు విడుదల

(మిగతా 6వ పేజీలో)

నీటి తీరువాతో సంబంధం లేకుండా..

గత ప్రభుత్వంలో సాగునీటి కాల్వల బాగు గురించి పట్టించుకోలేదు. దీంతో ఈ ఏడాది రైతులు నీటితీరువా సక్రమంగా చెల్లించలేదు. వసూలైన నీటి తీ రువాలో 80 శాతం నిధులు కాల్వల నిర్వహణకు కేటా యిస్తారు. అయితే ఈ సంవత్సరం కేవలం 10 నుంచి 25 శాతం వరకే అంటే రూ.32 కోట్లు మాత్రమే వసూలైంది. దీంతో నీటి తీరువా పూర్తిగా వసూలయ్యే వరకు ఆగాలని అధికారులు భావించారు. అప్పటి వరకు అంటే సీజన్ గడువు దాటిపోతుంది. ఈ పరిస్థితుల్లో నీటితీరువాతో సంబంధం లే కుండా కాల్వల అత్యవసర మరమ్మతులకు నిధులను మంజూరు చేయాలని ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. ఈ పరిస్థితుల్లో నీటి తీరువాతో సంబంధం లేకుండా మొత్తం నిధులు మంజూరు చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయం తీసు కుంది. ఈ నిర్ణయంతో తూర్పు, పశ్చిమ డెల్టా కాల్వలకు రూ.50 కోట్లు, సాగర్ కాల్వలకు రూ.37 కోట్లు మంజూరైనట్లు నీటి పారుదల శాఖ గుంటూరు జిల్లా నీటిపారుదల శాఖ ఇన్‌చార్జి ఎస్ఈ వెంకటరత్నం తెలిపారు.

జంపని డ్రెయిన్‌లో తూటికాడ




ఈ నెల 6న కాల్వల నిర్వహణకు నిధులు కావాలంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

మృత్యువేగం



రెండు కుటుంబాల్లో విషాదం

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

- శివాపురం వద్ద బొలేరో ట్రక్కు.. లారీ ఢీ
- బొప్పాయి కోత పనికి వస్తుండగా దుర్ఘటన
- మొత్తం నలుగురు మృతి ముగ్గురికి తీవ్రగాయాలు
- బాధితులందరూ యర్రగొండపాలెం మండల వాసులే



మృతిచెందిన రమణారెడ్డి, సుబ్బమ్మ, రామాంజి, అంకమ్మ దంపతులు



వినుకొండటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): సొంత గ్రామంలో పనులు లేవు.. 40 కిలోమీటర్ల దూరంలోని ఓ బొప్పాయి తోటలో కోత పనులు దొరికాయి. వారం నుంచి రోజూ ప్రయాణించి పను లు చేసుకుని తిరిగి ఇళ్లకు వెళ్తున్నారు. అయితే మంగళవారం వారు ఇళ్ల నుంచి పని ప్రాంతానికి బయల్దేరేరే కానీ ఇళ్లకు చేరలేదు. వేగం ఆయా కుటుంబాల్లో విషాదం నింపింది. రెండు కుటుంబాల్లో భార్యా భర్తలు మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని శివాపురం గ్రామసమీపంలో మంగళవారం ఉదయం జరిగిన ఈ దుర్ఘటనలో బాధితు లందరూ ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం సమీపంలోని గడ్డమీదపల్లెకు చెందిన వారే. ఇందుకు సంబంధించిన పోలీసులు తెలిపి న వివరాలు.. వెల్లలచెరువు సమీపంలోని


వైద్యశాల వద్ద విలపిస్తున్న రమణారెడ్డి కుటుంబసభ్యులు

అడ్డ రోడ్డుకు బొప్పాయి కాయలను కోసేం దుకు గడ్డమీదపల్లెకు చెందిన పగడాల రమణారెడ్డి(45), ఆయన భార్య సుబ్బమ్మ (40), జొన్నగిరి రామాంజి(36), ఆయన భార్య అంకమ్మ(28)తో పాటు కన్నెబోయిన నాగమణి, పగడాల శివమ్మ, కదిరి నాగేశ్వ రరావు(డ్రైవర్) బొలేరో ట్రక్కులో వస్తు న్నారు. అదే సమయంలో కొబ్బరికాయల లోడుతో వినుకొండ నుంచి మార్కాపురం వెళ్తున్న లారీ, కూలీలు ప్రయాణిస్తున్న బొలేరో ట్రక్కు వేగంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. లారీ రోడ్డుపై బోల్తా పడగా.. ట్రక్కులోని కూలీల్లో సుబ్బమ్మ, అంకమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. రమణారెడ్డి, రామాంజి వినుకొండలోని వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందారు. నాగమణి, శివమ్మ, నాగేశ్వరరావులు ప్రైవేటు వైద్యశా లలో చికిత్స పొందుతున్నారు.

నిరుపేద కుటుంబాలకు చెందిన వారే..

వేసవిలో స్వగ్రామంలో పనులు దొరకక పోవడంతో మృతుల కుటుంబాలు బొప్పా యి కాయలు కోసేందుకు వారం నుంచి వెల్లలచెరువు సమీపంలో ఓ బొప్పాయి తోటలో పనులకు వస్తున్నారు. బొలేరో ట్రక్కు నిండా కాయలు కోస్తే రూ.3700 వస్తాయి. దీంతో డ్రైవర్‌తో పాటు మిగిలిన ఆరుగురు కూలీలు ఆ మొత్తాన్ని పంచు కుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కూడా రోజులానే బయల్దేరగా మార్గమధ్యలో అనుకోని సంఘటనతో వారి కుటుంబాల్లో విషాదం అలుముకుం ది. రమణారెడ్డి, సుబ్బమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమార్తె అరుణ కు వివాహం చేయగా కుమారుడు వెంక టరెడ్డి, మరో కుమార్తె నవి త ఉన్నత చదువులు చదు వుతున్నారు. జొన్నగిరి రా మాంజి, అంకమ్మ దంపతు లకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రుల మృతితో పిల్లల పరిస్థితి ఏమిటని బంధువులు కన్నీ టి పర్యంతమవుతు న్నారు. ఒకే ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన దంపతులు మృతితో గడ్డ మీదపల్లె నుంచి పెద్దసంఖ్యలో వారి బం ధువులు, గ్రామస్థులు వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని సంఘటనపై విచారం వ్యక్తం చేశారు.

బాధితులకు అండగా ఉంటాం : ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

పనుల కోసం వస్తూ నలుగురు మృతి చెందడంపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సంతాపం తెలిపారు. ఘటన విషయం తెలిసిన వెంటనే ఆస్ప త్రికి వచ్చి మృతుల కుటుంబాలను పరా మర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయా న్ని అందజేస్తామన్నారు. మంత్రి లోకేశ్ సూచన మేరకు మృతదేహాలను స్వగ్రా మాలకు తరలించడంతో పాటు చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. యర్రగొండ పాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, ఆర్డీవో మధులత, డీఎస్పీ నాగేశ్వర రావు బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు.

పంచాయతీల పునఃవర్గీకరణ

- స్పెషల్ గ్రేడ్‌లోకి 12 పంచాయతీలు
- జనాభా, ఆదాయం ప్రాతిపదికన గ్రేడ్‌లు
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు
- ఈ నెల 16నే నివేదించాలని పీఆర్ కమిషనర్ స్పష్టీకరణ
- జిల్లాలో ప్రారంభమైన కసరత్తు

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను పునఃవర్గీకరించాల్సిందిగా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేసి, సూచనలు జారీ చేసింది. ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలోని గ్రామ పంచాయతీలను వర్గీకరణ చేసి ప్రతిపాదనలను పంపాలని కలెక్టర్‌కు సూచించింది. ఈ మేరకు ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ మంగళవారం జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారులతో సమావేశం నిర్వహించి, వివరించారు. ఈ నెల 16న సమగ్ర నివేదికని పంపించాల్సి ఉన్న దృష్ట్యా రెండు రోజుల్లో రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో డీపీవో కార్యాలయ వర్గాలు కసరత్తు ప్రారంభించాయి.

పంచాయతీల పునఃవర్గీకరణ ఇలా..

- జనాభా 10 వేలు దాటినా, పంచాయతీ ఆదాయం రూ. కోటికి మించినా స్పెషల్ గ్రేడ్‌గా అప్‌గ్రేడ్ చేయాలని ఆదేశించింది. అదే గిరిజన గ్రామ పంచాయతీ అయితే 5వేల కంటే అధిక జనాభా ఉంటే సరిపోతుంది.
- జనాభా 4 వేలకు అధికంగా 10 వేల లోపు ఉన్నా/ఆదాయం రూ.50 లక్షల కంటే పెచ్చు, రూ. కోటి కంటే దిగువన ఉన్నా/ మండల కేంద్ర గ్రామ పంచాయతీ అయినా దానిని గ్రేడ్-1గా ప్రతిపాదించాలని సూచించింది. గిరిజన గ్రామ పంచాయతీల్లో 3 వేలకు మించి 5 వేల మధ్యన జనాభా ఉన్నా, మండల కేంద్ర గ్రామ పంచాయతీ అయినా గ్రేడ్-1గా ప్రతిపాదించాలి.
- జనాభా 2 వేల నుంచి 4 వేల మధ్యన ఉంటే గ్రేడ్-2, గిరిజన జనాభా 1,500 నుంచి 3 వేలు ఉన్నా గ్రేడ్-2గా ప్రతిపాదించాలని స్పష్టం చేసింది.
- జనాభా 2 వేల కంటే దిగువన ఉన్నా, గిరిజన పంచా యతీల్లో 1,500 కంటే జనాభా దిగువన ఉన్నా గ్రేడ్-3గా వర్గీక రించి ప్రతిపాదించాలని సూచించింది.
- ఇదే విధంగా సిబ్బంది ప్యాటర్న్ ఎలా ఉండాలో కలెక్టర్ నిర్ణ యించి ప్రతిపా దించాలి. ఇందుకోసం బిల్డింగ్, లేఅవుట్ పర్మిషన్లు, శానిటేషన్ /డ్రెయిన్ క్లీనింగ్, తాగునీటి సరఫరా, వీధి లైట్లు, రెవెన్యూ కలెక్షన్, పంచాయతీ పరిపాలనని దృష్టిలో పెట్టుకోవాలని స్పష్టం చేసింది.

స్పెషల్ గ్రేడ్ పంచాయతీలుగా...

- ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో పెదకా కాని, చేబ్రోలు, తాడికొండ, నంబూరు, పేరేచర్ల, ఫిరంగిపురం, కొల కలూరు, ప్రత్తిపాడు, కొల్లిపర, దుగ్గిరాల, వడ్లమూడి, నీరు కొండని స్పెషల్ గ్రేడ్ గ్రామ పంచాయతీలుగా ప్రతిపాదించను న్నారు. వీటిల్లో జనాభా సంఖ్య 10 వేల కంటే మించి ఉంది. అలానే ఆదా యం కూడా బాగానే ఉంది.
- ఇక గ్రేడ్-1 జీపీలుగా వేజండ్ల, పొన్నెకల్లు, అమీనాబాద్, సిరి పురం, అంగలకుదురు, వెంగళాయపాలెం, ఈమని, చిలువూరు, ముట్లూరు, తుళ్లూరు, మేడికొండూరు, తక్కెళ్లపాడు, కాకుమాను, పెదరావూరు, వెనిగండ్ల, పెదపరిమి, నందివెలుగు, కట్టెవరం, మందడం, నారాకోడూరు, లాం, నడింపాలెం, మున్నంగి, వల్లభాపు రం, పెదనందిపాడు, లాలుపురం, రావెల, ఉప్పలపాడు, అత్తోట, గొట్టిపాడు, తూములూరు, డోకిపర్రు, శుద్ధపల్లి, సంగంజాగర్ల మూడి, కొర్నెపాడు, చింతలపూడి, చల్లావారిపాలెం, జగ్గడిగుంట పాలెం, కంతేరు, కొప్పు రావూరు, జొన్నలగడ్డ, యనమదల, రాయ పూడి, శలపాడు, శేకూరు, రేవేంద్రపాడు, పొనుగుపాడు, అనంతవ రప్పాడు, మామిళ్లపల్లి, నిడుముక్కల, ములుకుదురు, వట్టి చెరు కూరు, అగతవరప్పాడు, ఐనవోలు గ్రామాలను ప్రతిపా దించారు. మిగతావి గ్రేడ్-2, 3గా పునర్వర్గీకరిస్తున్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఇంటర్మీడియట్(ఓపెన్ స్కూల్) పబ్లిక్ పరీక్షలు సజా వుగా జరిగేలా సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకో వాలని డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి ఆదేశించారు. ఆయా పరీక్షల నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో అధికా రులతో డీఆర్వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 19 నుంచి 28 వరకు ఉద యం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగు తాయన్నారు. 27 కేంద్రా ల్లో జరిగే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 4,224 మంది విద్యార్థులు హాజరవు తారన్నారు. 19 నుండి 24 వరకు ఆరు కేంద్రాల్లో జరిగే ఇంటర్మీడియట్(ఓపెన్ స్కూ ల్) పబ్లిక్ పరీక్షల కు జిల్లాలో 971 మంది విద్యా ర్థులు హాజరవు తున్నారన్నారు. ఎండ లు దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద మంచినీరు, ఓఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, వైద్యశాఖ మెడికల్ క్యాంప్ లను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలన్నారు. ఆయా కేంద్రాలకు అవసరం మేరకు ఆర్టీసీ బస్సులు నడిపేలా అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈవో రేణుక, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ కే వెంకటరెడ్డి, డీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ నాగవర్ధన్, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉషాకిరణ్, ఎస్‌బీ ఎస్ఐ మహమ్మద్‌రఫి పాల్గొన్నారు.


పరీక్షల నిర్వహణపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఖాజావలి

కార్డెన్‌సెర్చ్‌తో నేరాల కట్టడి

- రామిరెడ్డితోటలో పర్యవేక్షించిన ఎస్పీ సతీష్‌కుమార్
- పోలీసుల తనిఖీలు.. 63 వాహనాలు స్వాధీనం

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో నేరస్థుల కదలికలను పసిగట్టి నేరా ల కట్టడికే కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామిరెడ్డి తోటలో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించగా ఎస్పీ స్వయంగా పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సరైన పత్రాలు లేని, నంబరు ప్లేట్లు లేని 60 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటో లను పోలీసులు స్వాధీ నం చేసుకున్నారు. మొబైల్ సెక్యూరిటీ చెక్ డివె సెస్‌తో అనుమానితుల వేలిము ద్రలు, చేతి ముద్రలను పరిశీలిం చగా విజయనగరానికి చెందిన ఓ సెల్ ఫోన్ దొంగను కనిపెట్టి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నలుగురు రౌడీషీటర్లు, ఇద్దరు సస్పెక్ట్ షీటర్ల ను పరిశీలించి, వారి ఇళ్లల్లో క్షుణ్ణంగా తనిఖీ చేశామ న్నారు. నగరంలో అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలా పాల నిరోధానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించిన వీడియోల ఆధారంగా ఏఏ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉందో పరిశీలించి, ఆయా ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలను పరిరక్షించడం, అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయడం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నిరోధించడం, గంజాయి రహిత జిల్లాగా మార్చడం వంటి ముఖ్య లక్ష్యాలుగా కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నా మన్నా రు. ఇప్పటికే నగరంలోని అరండల్‌పేట, లాలాపేట, నగరంపాలెం కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐలు వీరయ్యచౌదరి, శివప్రసాద్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.


కార్డెన్‌సెర్చ్‌పై సిబ్బందికి ఆదేశాలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరులో ల్యాండ్ రికార్డ్స్
డిజిటలైజేషన్ వర్క్ షాప్

● గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులు
● పాల్గొననున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ వర్క్‌షాప్ ఈసారి గుంటూరు కేంద్రంగా జరగబోతుంది. గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ఈ వర్క్‌షాప్ రెండు రోజులు పాటు నిర్వహించనున్నారు. దేశంలోని ప్రతి పౌరుడికి ఆధునిక సాంకేతికతతో కూడిన భూ రికార్డులను అందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ ఆధునికీకరణ' కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ రెండు రోజుల వర్క్‌షాప్‌ను ప్రజల ముందుకు తీసుకువస్తోంది. అయితే ఈ కార్యక్రమాన్ని ఆ శాఖ కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు పార్లమెంటు సభ్యుడు తన నియోజకవర్గంలో నిర్వహించేందుకు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో గుంటూరులోని ఐటీసీ వెల్కమ్ హోటల్లో ఈ వర్క్‌షాప్‌ను కేంద్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి పెమ్మసానితో పాటు రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన సెక్రటరీ శ్రీమతి జయలక్ష్మి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ మనోజ్ జోషి, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ఇతర అదనపు సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు, డైరెక్టర్లు కూడా ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

బీటెక్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

పెదకాకాని, మే 13(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివ ప్రసాదరావు విడుదల చేశారు. 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పునఃమూల్యాంకనం కోసం మే 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. పరీక్షల ఫలితాలు, సమగ్ర సమాచారం ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

మరమ్మతులకు.. మోక్షం

(5వ పేజీ తరువాయి)

చేయలేదు. రైతుల చెల్లించిన నీటి తీరువా ఆధారంగా విడుదల చేసే ఓఅండ్ఎం నిధులనూ ఇవ్వలేదు. ఓఅండ్ఎం నిధులు ఏటా రూ.20 నుంచి రూ.25 కోట్ల వరకు అవసరమని ప్రతిపాదనలు పంపితే రూ.7 నుంచి రూ.11 కోట్లు మాత్రమే మంజూరు చేసేది. ఆ నిధులను ఖరీఫ్ సీజన్ మొదలయ్యే తరుణంలో విడుదల చేయడం.. గడువులోపు పూర్తిచేయలేకపోయారంటూ వెనక్కు తీసుకోవడం పరిపాటిగా మారింది. అరకొర పనులతో మమ అనిపించి నిధులను దోచేసిన ఘటనలు కూడా ఉన్నాయి. దీంతో గడచిన ఐదేళ్లు సాగునీటి కష్టాలతో రైతులు అల్లాడిపోయారు. నీరు లేనప్పుడు నీటి కష్టాలు వెంటాడితే, వర్షాలు ఎక్కువగా పడిన సమయంలో నీరు ఎక్కువై కాల్వలకు గండ్లుపడి, పంటలను తుడిచిపెట్టేసిన పరిస్థితులున్నాయి. సజావుగా పంట పండుతుందన్న నమ్మకంలేక పొలాలను ఖాళీగా వదిలేసిన సందర్భాలున్నాయి.

అమరావతి రాజమార్గాల పనులకు పీఎంసీల కోసం టెండర్లు

విజయవాడ, మే 13(ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రధాన రాజమార్గాల పనులను వేగవంతంగా చేపట్టేందుకు వీలుగా ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ (పీఎంసీ) కోసం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) మంగళవారం టెండర్లు పిలిచింది. అమరావతి ప్రధాన రాజమార్గాలైన ఈ-13, ఈ-15ను రూ.750 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు ఇటీవల టెండర్లు పిలిచింది. టెండర్లు కూడా ఖరారు కావస్తున్నాయి. ఈ క్రమంలో పనులను ముందుకు తీసుకు వెళ్లటానికి వీలుగా పీఎంసీలను నియమించాలని నిర్ణయించటం జరిగింది. వీరి పర్యవేక్షణలో కాంట్రాక్టు సంస్థ పనులు చేపట్టాల్సి ఉంటుంది.





తానికొండ దయాబాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, వేగేశన నరేంద్రవర్మ

దయాబాబు మృతి టీడీపీకి తీరనిలోటు

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్.. ● అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు వేగేశన, ఆనందబాబు

బాపట్ల, మే13 (ఆంధ్రజ్యోతి): నిబద్ధత, అంకితభావంతో పార్టీ కోసం పనిచేసిన తానికొండ దయాబాబు మృతి తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు అని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలోనే తుదిశ్వాస విడిచిన దయాబాబు మృతదేహానికి మంగళవారం ఎంపీతో పాటు.. బాపట్ల, వేమూరు ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, నక్కా ఆనందబాబు, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖరబాబు, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ సందర్శించి, పుష్పాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన అంతిమ యాత్రలో కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మృతదేహంపై తెలుగుదేశంపార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రకార్యదర్శి గంటా అంజిబాబు, మాజీ కౌన్సిలర్ పేర్లి సునీల్‌కుమార్, బక్కా రోశయ్య, టీడీపీ, బీజేపీ నాయకులు తదితరులు నివాళులర్పించారు.

మాజీ ఎమ్మెల్యే రోశయ్య మా స్థలాన్ని ఆక్రమించారు

● స్థలం దగ్గరకు వస్తే చంపుతామని బెదిరిస్తున్నారు ● కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన మహిళ



జరుగుతున్న అక్రమ నిర్మాణాలు

గుంటూరు కార్పొరేషన్, మే 13(ఆంధ్రజ్యోతి): తమ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆక్రమించారని, అందులో అనధికారకంగా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని బాధితురాలు గుమ్మడి భారతి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. గుంటూరు నగరంలోని చుట్టుగుంటలో ఉన్న కేకేఆర్ సినిమా హాల్ వెనుక భాగంలో భారతి స్థలం ఉంది. దానికి ముందు, వెనుక భాగంలో పొన్నూరు మాజీ ఎమ్మెల్యే రోశయ్యకు స్థలం ఉంది. ఈ క్రమంలో భారతిని స్థలం విక్రయించాలని గతంలో అనేక పర్యాయాలు రోశయ్య అడిగారు. అందుకు ఆమె అంగీకరించలేదు. ఈ క్రమంలో తమ స్థలాన్ని కూడా కలుపుకొని అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారంటూ బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. అదేమని ప్రశ్నిస్తే రోశయ్య అనుచరులు శ్రీకాంత్, రామబ్రహ్మం తమను బెదిరిస్తున్నారని తెలిపింది. ఈ విషయమై రోశయ్యను కలిసి విన్నవిస్తే.. ఆ స్థలం తమదేనని, మీకు దిక్కున్న కాడ చెప్పుకోండి అని అన్నారని, నిర్మాణాలకు అడ్డొస్తే చంపేస్తానంటూ బెదిరిస్తున్నారని బాధితురాలు భారతి కమిషనర్, జిల్లా కలెక్టర్లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విస్తరణకు సమష్టిగా కృషి చేయాలి

● రైతు సాధికార సంస్థ సీఈవో రామారావు



మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ సీఈవో రామారావు

గుంటూరు సిటీ, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.రామారావు పేర్కొన్నారు. మంగళవారం గుంటూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. సీఈవో రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో 11.60 లక్షల మంది రైతులు 13 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం విధానాలు అనుసరిస్తున్నారని తెలిపారు. నేషనల్ రిసోర్స్ ఆర్గనైజేషన్‌గా గుర్తించబడ్డ రైతు సాధికార సంస్థ ప్రపంచ స్థాయిలోనూ గుర్తింపు పొందిందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల రైతుల సంక్షేమంతో పాటు ప్రజలు, నేల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్, 365 రోజుల పచ్చదనం, నేల ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపుతుందని చెప్పారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు ప్రకృతి వ్యవసాయం దిశలో వెళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. మూడు రోజుల శిక్షణలో నేర్చుకొన్న అంశాలను గ్రామ స్థాయి వరకు చిత్తశుద్ధితో తీసుకువెళ్లాలని కోరారు. రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డీవీ రాయుడు, వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు శిక్షకులకు పలు సూచనలు చేశారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ వీడియో ప్రసంగాన్ని ప్రదర్శించారు. సంస్థ లీడ్‌లు గోపీచంద్, చంద్రశేఖర్, చక్రవర్తి, సీనియర్ కన్సల్టెంట్‌లు రామచంద్రం, రవిచంద్ర, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాలో 59,877 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వ

సంయుక్త వ్యవసాయ సంచాలకులు కృపాదాస్



సంయుక్త వ్యవసాయ సంచాలకులు కృపాదాస్

నరసరావుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికి 59,877 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు హోల్ సేల్, రిటైల్ దుకాణాలతో పాటు వివిధ కంపెనీల గోదాముల్లో ఉన్నాయని సంయుక్త వ్యవసాయ సంచాలకులు వీడీవీ కృపాదాస్ తెలిపారు. ఎరువుల నియం త్రణ చట్టం 1985, ఎరువుల వినియోగం పై స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో అయన మాట్లాడారు. ఖరీఫ్‌లో అవసరం మేరకు.. కొరత లేకుండా జిల్లాకు ఎరువులను సరఫరా చేయడం జరుగు తోందన్నారు. చట్టానికి లోబడి నిజాయితీతో రైతులకు నష్టం లేకుం డా.. వ్యాపారం చేయాలని ఎరువుల వ్యాపారులకు సూచించారు. తగు రశీదు ఇవ్వడమే కాక ఆధార్ సంఖ్యతో ఈ పాస్ నందు అమ్మకాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో 590 మందికి ఈ పాస్ పరికరాలు సరఫరా చేయడం జరిగిందన్నారు. పరికరాల నిర్వణకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. జిల్లాలో మూడేళ్లలో అధిక మొత్తంలో యూరియా విక్రయించిన 1,393 మంది డీలర్లను విచారించి 334 మందికి రూ. 11,45,000 అపరాధ రుసుం విధించినట్లు వెల్లడించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి మా ట్లాడుతూ గతేడాది 3,05,261 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు సరఫరా చేశామని చెప్పారు. పల్నాడు జిల్లా ఎరువుల వాడకంలో రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉందని వెల్లడించారు. సగటున హెక్టారుకు 445 కేజీలు వివిధ పోషకాలను ఎరువుల రూపంలో వాడుతున్నారని తెలిపారు. వ్యవసాయ సంచాలకులు రాజన్, ప్రేమ్ కుమార్, రవికుమార్, వ్యవసాయ అధికారి పి.ప్రవీణ్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని బాలుడి మృతి



నరసరావుపేట లీగల్, మే 13, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్జీవో కాలనీ మొదటి వీధిలో ఉన్న ప్రత్యేక దత్తత సంస్థలో ఈ నెల 12న రాత్రి మూడేళ్ల గుర్తుతెలియని బాలుడు మృతి చెందినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. ఈ నెల 11న మధ్యాహ్నం నరసరావుపేట రూరల్ పోలీసులు మూడేళ్ల అనాథ బాలుడిని తీసుకొచ్చి చేర్పించారని సంస్థ మేనేజర్ మాతంగీ కుమారి ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు బాబు శారీరకంగా మానసికంగా, బలహీనంగా ఉన్నట్లు తెలిపారు. ప్రత్యేక దత్తత సంస్థ సిబ్బంది బాబుకు రాత్రి పాలు ఇచ్చారని, అర్ధరాత్రి ఉలుకు పలుకు లేకుండా బాబు పడి ఉన్నాడని సంస్థ సిబ్బంది మేనేజర్ కుమారికి తెలియపరిచారు. ఆమె బాలుడిని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారని పేర్కొన్నారు. బాలుడి వివరాలు తెలిసిన వారు నరసరావుపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో, 94906 17742, 0864 7225333 నంబర్లకు సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 13(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారంకి 512.90 అడుగులు ఉంది. ఇది 136.64 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 450, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రైతులకు ప్లాట్ల కేటాయింపు బాధ్యత కమిషనర్‌దే..

విజయవాడ, మే 13 (ఆంధ్రజ్యోతి) : అమరావతి రాజధాని ప్రాంతంతో పాటు, సీఆర్‌డీఏ పరిధిలో భూ సమీకరణ విధానాన్ని అవలంభించాల్సి వస్తే.. భూ యజమానులకు ఇచ్చే రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు బాధ్యతలను ఇక మీదట సీఆర్‌డీఏ కమిషనర్ కానీ, అథారిటీ కానీ కేటాయింపులు జరిపే అధికారాన్ని కల్పిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో రిటర్నబుల్ ప్లాట్లను లాటరీ పద్ధతిలో నిర్వహించేవారు.

భర్తను ముంచేసి ఉడాయించిన భార్య

రూ.80 లక్షలకుపైగా మోసం చేసిందంటూ ఫిర్యాదు

అనంతపురం, మే 13(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడైన భర్తను మోసగించి, లక్షలాది రూపాయలతో ఉడాయించింది ఓ భార్య. దీనిపై బాధితుడు, అనంతపురం జిల్లా బెళుగుప్ప ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఇబ్రహీం ఫయాజ్ బాషా మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫయాజ్ బాషా పోలియో కారణంగా దివ్యాంగుడయ్యారు. ఆయనకు గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షేక్ షబీనాతో మూడేళ్ల క్రితం వివాహమైంది. జల్సాలకు డబ్బులివ్వాలని ఆమె భర్తను బెదిరించేది. ఫయాజ్ బాషా పేరున బ్యాంకులో రూ.30 లక్షలు రుణం తీసుకుని, తన అక్క జరీనాకు ఇచ్చింది. ఇంటి స్థలాన్ని రూ.41 లక్షలకు దౌర్జన్యంగా అమ్ముకుంది. ఐదు తులాల బంగారం, రూ.6 లక్షల కారుతో గత నెల 29న పరారైంది. తన భార్యతోపాటు ఆమె అక్క, తల్లిదండ్రులు తనను మోసగించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శివ తెలిపారు.

సబ్ ట్రెజరీలోని విగ్రహాల పరిశీలన



బాపట్ల, మే13 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల సబ్ ట్రెజరీ కార్యాలయంలో 2013లో డిపాజిట్ చేసిన విగ్రహాలను అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. 2003లో పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామ రైతు అన్వర్ ఆలీ అన్నారి పొలం మరమ్మతులు చేస్తుండగా అందులో విలువైన విగ్రహాలు, సామగ్రి బయటపడింది. అధికారులు వాటిని సేకరించి భద్రపరిచారు. అనంతరం బాపట్ల సబ్‌ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేశారు. 2014లో సదరు రైతు తన పొలంలో లభించిన విగ్రహాల విలువలో కొంత తనకు ఇచ్చి ఆదుకోవాలని కోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు ఆదేశాల మేరకు తాజాగా పురావస్తుశాఖాధికారుల బృందంతోపాటు పిట్టలవానిపాలెం తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, చందోలు వీఆర్వో అరుణ ప్రసన్న, ఆర్ఐ శ్రీనివాసరావు, చందు తదితరులు కలిసి డిపాజిట్ చేసిన విగ్రహాలను, సామగ్రిని పరిశీలించి, తిరిగి డిపాజిట్ చేసి వెళ్లారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఆరుగురికి గాయాలు

వినుకొండటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురితో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని కొత్తపాలెం సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబాల వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ మేరేట్ నుంచి వలస వచ్చి నీలగంగవరంలో మసీదులో పనిచేస్తున్న ముజమ్మీర్, బాహర భార్యభర్తలతో పాటు అత్త షమీమ్, ఇద్దరు చిన్నారులు ద్విచక్ర వాహనంపై వినుకొండ వస్తున్నారు. వీరిని కొత్తపాలెం గ్రామానికి చెందిన పల్లెపోగు పీటర్ ద్విచక్ర వాహనంపై వస్తూ ఎదురెదురుగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అందరూ గాయపడ్డారు. హైవే అంబులెన్స్ ద్వారా పీటర్‌ను వైద్యశాలకు తరలించగా.. ముజమ్మీర్ కుటుంబ సభ్యులు ఆటోలో ఓ ప్రైవేటు వైద్యశాలకెళ్లి.. చికిత్స పొందుతున్నారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య



ఆదినారాయణ (పాతచిత్రం)

ముప్పాళ్ళ మే13 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చాగంటివారిపాలెంలో జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆళ్ల ఆదినారాయణ(45) ఏటా ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పసుపు పంటలను సాగుచేస్తుంటారు. సాగు ఖర్చులకు రూ.10 లక్షల వరకు అప్పులు చేశారు. ఈ ఏడాది కూడా ఆశించిన మేర దిగుబడి రాకపోవడం, పంటలకు మద్దతు ధర లేకపోవడంతో.. అప్పులు తీర్చే మార్గం లేదని సోమవారం ఇంటి వద్దే గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ ఆదినారాయణ మంగళవారం మృతిచెందాడు. మృతునికి భార్య రమా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గాజుల్లంక ఇసుక క్వారీలో ఆకస్మిక తనిఖీలు

● యంత్రాలు సీజ్ చేయాలని అధికారులను ఆదేశించిన ఆర్డీవో



క్వారీలో తనిఖీలు చేస్తున్న ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు

కొల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): గాజుల్లంక ఇసుక క్వారీలో ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఇష్టానుసారంగా ఇసుక తవ్వుతున్నారని, రాత్రిపగలు తేడా లేకుండా యంత్రాలను వినియోగిస్తూ ఇసుక తోడేస్తున్నారని రైతులు అధికారులకు వివరించారు. గుర్తించిన ప్రాంతంలో కాకుండా.. మరొక ప్రదేశంలో తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఏడీ రాజేష్ కుమార్‌ను వివరణ కోరగా జియో కో-ఆర్డినేట్స్ ప్రకారం హద్దులు కాంట్రాక్టర్ చూపించడం జరిగిందని, ఇసుక తవ్వకాలు అక్కడే చేస్తున్నట్లుగా తెలిపారు. మీటరు లోతున తవ్వకాలు చేయాలని వారికి ముందే చెప్పామని ఏడీ వివరించారు. ఇప్పటికే నదిలో భారీ యంత్రాలతోనే తవ్వకాలు సాగుతున్నాయని, మీ కళ్ల ఎదుటే నది నుంచి ఇసుక లోడ్‌తో లారీలు రావడం మీరు గమనించలేదా అంటూ అధికారులను స్థానికులు ప్రశ్నించారు. స్పందించిన ఆర్డీవో యంత్రాలు సీజ్ చేయాలని ఏడీని ఆదేశించారు. పైగా ప్రభుత్వ ఉచిత ఇసుక క్వారీని నిలుపుదల చేసి, వర్షా కాలంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక నిల్వ చేయిస్తున్నామని అధికారులు స్థానికులకు వివరించి, అక్కడ నుంచి నిష్క్రమించారు. తనిఖీలలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, సీఐ బీవీ ఆంజనేయులు, ఏఎస్ఐ అర్జున్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రుణం తీర్చలేక.. రైలు కింద పడి..!

వినుకొండటౌన్, మే 13, (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ బ్యాంక్ సిబ్బంది వేధింపులు తట్టుకోలేక ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మార్కాపురం రోడ్డులోని గొర్రెల మండీ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఈపూరు మండలం కొచ్చర్ల గ్రామానికి చెందిన తొగటి బుల్లి రోశయ్య (40) కొతకాలం క్రితం ప్రైవేట్ బ్యాంక్‌లో ఇంటిని తనకాపెట్టి రుణం తీసుకున్నాడు. క్రమం తప్పకుండా కొంత కాలంగా లోన్ చెల్లిస్తూ వచ్చాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులకు గురై, చేసిన అప్పులు తీర్చలేక బ్యాంక్ రుణం చెల్లించలేక పోయాడు. ఈ క్రమంలో ప్రైవేట్ బ్యాంక్ సిబ్బంది వేధింపులు తాళలేక మూడు రోజులు క్రితం రోశయ్య ఇంటి నుండి వెళ్లిపోయినట్లు సమాచారం. చివరకు సాయంత్రం 5 సమయంలో ఇంటికి ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసినట్లు తెలిసింది. చివరకు రైలు కింద పడి మృతి చెందినట్లు ఆప్రాంత వాసులు తెలిపారు. రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు తమకు రైల్వే కీమేన్ ఇచ్చిన వివరాలు మాత్రమే ఉన్నాయని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

17 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

చిలకలూరిపేట, మే13 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 17, 18, 19 తేదీల్లో సీపీఎం, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో చిలకలూరిపేటలోని తూర్పు మాలపల్లిలోని చంద్రమౌళి పార్క్ క్రీడా మైదానంలో మూడు రోజులు పాటు ఫ్లడ్ లైట్ల వెలుగులో నైట్ మ్యాచ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు తమ జట్లను ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సాతులూరి హనుమంతరావు 98497 94238, ఆంజనేయ రాజు 95730 67224, సాతులూరి ప్రకాష్ 99633 73996, సాతులూరి బెంజమిన్ 86887 45866, శివ గణేష్ 63054 07457 నంబర్లకు సంప్రదించాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డులో పరిశీలన చేస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

ఏటీ అగ్రహారం విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

● మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ, చుట్టుగుంట చెరువు అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయటానికి ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో ప్రజాప్రతినిధుల సహకారంతో చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ఆదేశించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులతో కలిసి మంగళవారం చుట్టుగుంట చెరువు దగ్గర నుంచి కంకరగుంట ఆర్‌యూబీ వరకు జరుగుతున్న విస్తరణ, అభివృద్ధి పనులు పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ మాస్టర్ ప్లాన్ మేరకే జరగాలన్నారు.

కమిషనర్ మాట్లాడుతూ ఏటీ అగ్రహారం విస్తరణ పనులు జరిగిన ప్రాంతంలో రోడ్డుల నిర్మాణానికి కాంట్రాక్టర్ పనులు చేసేలా ఇంజనీరింగ్ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ కోటేశ్వరరావు, డీసీపీ సూరజ్ కుమార్, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మొండి గేటు నుంచి కాలువ సర్వే చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మే 13(ఆంధ్రజ్యోతి) గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్‌ని మొండిగేటు నుంచి జాతీయ రహదారి వరకు సమగ్రంగా సర్వే చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. కమిషనర్ మంగళవారం పాత గుంటూరు మొండిగేటు, బాలాజీ నగర్, వెహికల్ షెడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ జాతీయ రహదారి నుండి మొండి గేటు వరకు సమగ్ర సర్వే చేసి, ఆక్రమణలు, అనధికార కల్వర్టులను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అనంతరం జీఎంసీ వెహికల్ షెడ్‌ని పరిశీలించి మరమ్మతులకు గురైన ఏ వాహనం అయినా రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ సతీష్, ఏఈలు, టీపీఎస్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలికల విద్యకు దాతల సహకారం మరువలేనిది

● కేజేఎస్ఎస్ అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), మే 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ పేద, ప్రతిభ కలిగిన బాలికల విద్యకు దాతలు అందజేస్తున్న సహకారం మరువలేనిదని కమ్మ జన సేవా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అన్నారు. స్థానిక కుందుల రోడ్డులోని బాలికల వసతి గృహ ఆవరణలో మంగళవారం కేజేఎస్ఎస్ 48వ వార్షికోత్సవం, సమితి వ్యవస్థాపకుల ఘన సత్కార కార్యక్రమం జరిగింది. సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ సమితి దినదినాభివృద్ధి చెంది నేడు నూతక్కి రామకృష్ణప్రసాదు, చల్లా రాజేంద్రప్రసాదు భారీ విరాళాలతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యక్షుడు మల్లెల హరేంద్రనాధ్ చౌదరి మాట్లాడుతూ మహిళ విద్యను ప్రోత్సహించాలని నాటి కమిటీ తొలి తీర్మానం చేసిందని గుర్తు చేశారు. వ్యవస్థాపకులు డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణయ్య, బొప్ప సుబ్బారావు, సూర్యదేవర హనుమంతురావు, పి నాగేశ్వరరావు, రాయని రమణలు మాట్లాడుతూ ఎన్నో ఇబ్బందులతో స్థాపించిన సంస్థ నేడు దాదాపు 1600 మందికి వసతి కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి నాగేంద్రం, గుంటుపల్లి కోటేశ్వరరావు, వడ్లమూడి శివరామకృష్ణయ్య, పెద్ది సాంబశివరావు, ఘంటా పున్నారావు, గోరంట్ల పున్నయ్య చౌదరి, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, మద్రిపూడి సీతారామయ్య, వంకాయలపాటి బలరామకృష్ణయ్య, దాతలు కావూరి రవిచంద్ర పాల్గొన్నారు.



కేజేఎస్ఎస్ వ్యవస్థాపకులను సత్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు వర్తింపజేయాలి

● కలెక్టరేట్ ఎదుట నిరసన

గుంటూరు(తూర్పు), మే 13(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులందరికి అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు జారీ చేయాలని, కౌలు రైతుల ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొత్త కార్డులు జారీ చేయకుండా అన్నదాత సుఖీభవ పథకం ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆర్బీఐ నిబంధనల మేరకు ఎటువంటి హామీ లేకుండా రూ 2 లక్షల పంట రుణం మంజూరు చేయాలని కోరారు. ధర్నా అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవతేజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కంజుల రెడ్డి, పీవీ జగన్నాథం, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, కాబోతు ఈశ్వరరావు, కే.అజయ్, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేపాల్‌దేవ్ భట్టాచార్య మరణం కార్మికులకు తీరని లోటు

గుంటూరు(తూర్పు), మే 13 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్) జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ నేపాల్ దేవ్ భట్టాచార్య మరణం రవాణా రంగ కార్మికులకు తీరని లోటని ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ అన్నారు. తీవ్ర అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన నేపాల్‌దేవ్ భట్టాచార్య చిత్రపటానికి సీఐటీయూ జిల్లా కార్యాలయంలో పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.గంగాధర్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, దండా లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడుతూ నేపాల్ దేవ్ స్ఫూర్తితో రవాణా రంగ కార్మికుల హక్కుల కోసం ఉద్యమించడమే ఆయనకిచ్చే ఘన నివాళి అని అన్నారు.

మాతృదేవోభవపై ప్రవచనం

గుంటూరు (తూర్పు), మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మంగళవారం సుందర సత్సంగ్ సభ్యులు కేవీ కోటేశ్వరరావుచే జగద్గురు శ్రీ శంకరాచార్యుల వారు రచించిన మాతృదేవోభవ అనే అంశంపై ప్రవచనం జరిగింది. ప్రవచనాన్ని ప్రారంభిస్తూ ఆ భగవంతుడి ప్రతిరూపమే తల్లి అన్నారు. ప్రాణం ఉన్నంత కాలం తల్లిదండ్రుల సేవలు చేసిన వారికి సౌభాగ్యం, నిరంతరానందం కలుగుతుందన్నారు. కంటికి కనిపించే పరదేవతే తల్లి అని జగద్గురు శంకరాచార్యులవారు మాతృ పంచకంలో వివరించారని తెలిపారు.

సమ్మెకు సహకరించండి

● పౌరసరఫరాల సంస్థ మేనేజర్ లక్ష్మీకి నోటీసు అందజేత

గుంటూరు(తూర్పు), మే 13(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో సివిల్ సప్లయిస్ కార్మికులు పాల్గొంటారని ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు స్పష్టం చేశారు. పౌరసరఫరాల సంస్థ మేనేజర్ గిడ్డి లక్ష్మీకి మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోట్ల మరియదాసు, చిలక నాగరాజు, ఎం.పెద్ద కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వెన్నుదన్నుగా నిలుస్తాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్



దివ్యాంగుల వద్దకు వెళ్లి పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉపకరణాలు ఇవ్వడం ద్వారా వారికి వెన్నుదన్నుగా నిలవబోతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలో దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకుగాను అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూదోట సునీల్‌తోకలిసి ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ దివ్యాంగులను, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. వారి ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో దివ్యాంగులకు ఇచ్చిన ఉపకరణాలు వారికి ఉపయోగపడేవి కావని, దీంతో తీవ్ర సమస్యలు ఎదుర్కొనే వారిని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో దివ్యాంగులకు ఎలాంటి పరికరాలు అవసరమో గుర్తించి, కొలతలు తీసుకొని అందించేందుకు సీఎం చంద్రబాబు ఏర్పాట్లు చేశారని ఆయన చెప్పారు. ఉపకరణాలు సిద్ధం చేస్తున్న ఆలింకో సంస్థ ప్రతినిధులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రెండు సెంట్ల స్థలం ఇచ్చేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇల్లు కట్టుకోలేని వారికి ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని చెప్పారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

గుంటూరులోని జలగం రామారావు హైస్కూల్లో ఈనెల 14న నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. జాబ్ మేళా సందర్భంగా ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 50 ప్రముఖ కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటున్నాయని, యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో పాల్గొన్న జాయింట్ కంట్రోలర్ మాధురి

రైస్ ప్యాకింగ్‌లో నియమాలను పాటించాలి

● జాయింట్ కంట్రోలర్ మాధురి

గుంటూరు(తూర్పు), మే 13(ఆంధ్రజ్యోతి): రైస్ బ్యాగ్‌ల ప్యాకింగ్‌లో మిల్లర్లు నియమాలను పాటించాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎస్ఎస్ మాధురి అన్నారు. మెట్రాలజీ డే కార్యక్రమాల్లో భాగంగా స్థానిక విద్యానగర్, లీగల్ మెట్రాలజీ కార్యాలయంలో మంగళవారం రైస్ మిల్లర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బియ్యం సంచుల తూకం విషయంలో ఖచ్చితత్వం పాటించాలని, ప్రతి బ్యాగ్‌పై డిక్లరేషన్‌ను ముద్రించాలని స్పష్టం చేశారు. రైస్ ప్యాక్ చేసేవారు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. వేయింగ్, మెజరింగ్ పరికరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డిప్యూటీ కంట్రోలర్ షాలెమ్ రాజు, అసిస్టెంట్ కంట్రోలర్ జి.కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజా, వ్యాపారులు పాల్గొన్నారు.



బస్టాండ్ ఆవరణలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఎన్ఎంయూ ఉద్యోగులు

ఆర్టీసీలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలి

● ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి

గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సమ్మెకైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి హెచ్చరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బస్టాండ్‌లోని జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) కార్యాలయం ముట్టడి కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రమణారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో పోస్టులు భర్తీ చేయకపోవటంతో ఉద్యోగులు పని భారంతో వత్తిడి గురై అనారోగ్యాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు పాత వైద్య విధానాన్ని అమలు చేయా లని, పదోన్నతులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ సుబ్బారావు, జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, డిపో కార్యదర్శులు శంకరరావు, అమర్‌నాథ్, పున్నయ్య, శ్రీనివాసరావు, చిన్నబ్బాయి, రాంబాబు రెడ్డి, సుధాకర్, వెంకటేశ్వరమ్మ, హేమలత, శివలీల తదితరులున్నారు.

ఉద్యోగుల నిరసన ప్రదర్శన

రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా నాయకులతో కలిసి బస్టాండ్ ఆవరణలో నిరసన ప్రదర్శన చేశారు. సైకిళ్లతో బల్ల బండితో నేరుగా డీపీటీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీగా వెళ్లారు. ఎటువంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పాతగుంటూరు పోలీసులు, ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఆపరేషన్ సిందూర్ విజయంలో జవానుల పాత్ర కీలకం

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయంలో మన జవానుల పాత్ర అమోఘమని ఆంధ్రప్రదేశ్ మాల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్ కొనియాడారు. ఏసీ కళాశాల సెమినార్ హాల్లో సిందూర్ అమర వీరులకు నివాళిగా మంగళవారం జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'జయహో భారత్' ప్రార్థనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాని పోరాట స్ఫూర్తితో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలు, క్రైస్తవ ప్రార్థన మందిరాలు, మసీదుల్లో జవానులలో స్థైర్యాన్ని నింపేందుకు ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునివ్వడం దేశ భద్రతపై నిబద్ధతకు, నిదర్శనమన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉగ్రవాద వ్యతిరేక పోరుపై అంతర్జాతీయ సమాజం నుంచి భారత్ చక్కటి మద్దతు పొందినట్లు తెలిపారు. పాస్టర్ పాల్ ఇమ్మాన్యుయల్ ప్రార్థన, వచనంలో ఉగ్రవాదంపై పోరులో జవానుల ఆధ్యాత్మిక శక్తి గురించి వివరించారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ గౌతమ్ రాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి బేతంపూడి విజయ్‌శేఖర్, ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ కొర్రపాటి నాగేశ్వరరావు, ఆళ్ల హరి, కే.మనోహర్, సునీల్, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.



అమరవీరులకు జోహార్లు అర్పిస్తున్న జనసేన నాయకులు

నేడు అరండల్‌పేట శివాలయానికి హంపి పీఠాధీశ్వరుల రాక

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీ బుధవారం అరండల్‌పేట శివాలయానికి రానున్నారు. ఆలయ ఆవరణలో సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్పస్వామి ఆలయ శిఖర, కలశ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొంటారు. ఆయనే స్వయంగా ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తారు. చివరి రోజైన బుధవారం పూర్ణాహుతి, యంత్ర ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, మంగళహారతి, శాంతి కల్యాణం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని అయ్యప్ప సేవా సమాఖ్య నేత సిరిపురపు శ్రీధర్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విపత్తుల నిర్వహణకు మాక్ డ్రిల్ : డీఆర్వో

గుంటూరు(తూర్పు), మే 13 (ఆంధ్రజ్యోతి): వరదలు, తుఫాన్‌లు, అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తక్కువ నష్టం, ముఖ్యంగా ప్రాణహాని జరగ కుండా చేపట్టాల్సిన చర్యలపై బుధవారం కలక్టరేట్‌లో మాక్ డ్రిల్ నిర్వహి స్తున్నట్లు డీఆర్వో షేక్ ఖాజావలీ తెలిపారు. కలెక్టరేట్, డీఆర్సీ సమావేశ మం దిరంలో మంగళవారం మాక్ డ్రిల్‌పై జరిగిన అధికారుల సమావేశంలో ఆయ న మాట్లాడారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ ఆదేశాల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి సంబంధిత శాఖలు ఏర్పా ట్లు, పరికరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో విపత్తు నిర్వహణ శాఖ జిల్లా పీడీ ఏ.లక్ష్మీ కుమారి, డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ శ్రావణ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్ ఖాజావలీ, పాల్గొన్న ఏ లక్ష్మి కుమారి, శ్రీనివాసరెడ్డి

హత్యా... ఆత్మహత్యా?

● సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతిపై అనుమానాలు

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో వివాహిత అనుమానాస్పద మృతి కేసులో అనుమానాలు ముసురుకుంటున్నాయి. భర్త రెండో కంటికి తెలియకుండా మృతదేహాన్ని స్వగ్రామం ఓబుల్‌నాయుడుపాలెం తీసుకురావడం కలకలం రేపింది. దీంతో మృతురాలి తండ్రి ఫిర్యాదుతో.. మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. చందానగర్ పోలీసులు వచ్చి మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం నిర్వహించాల్సి ఉంది. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామానికి చెందిన హేమలత, ఓబుల్‌నాయుడుపాలెం గ్రామానికి చెందిన మురళి ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో హేమలత కుటుంబ సభ్యులు వీరి ప్రేమను అంగీకరించలేదు. దీంతో హేమలత తల్లిదండ్రులను ఎదిరించి మురళిని వివాహం చేసుకుంది.

హేమలత హైదరాబాదులోని ప్రముఖ కంపెనీలో సాఫ్ట్వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. లింగంపల్లి ప్రాంతంలో భార్యభర్తలు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు న్నారు. పిల్లలు ఓబుల్‌నాయుడుపాలెంలోని మురళి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. మురళి జులాయిగా తిరుగుతూ.. బెట్టింగ్‌లకు అలవాటుపడి డబ్బులు కోసం నిత్యం భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. హేమలత తన శక్తికి మించి అప్పులు చేసి అడిగినంత భర్తకు ఇచ్చింది. తల్లిదండ్రు లను ఎదిరించి పెళ్లి చేసుకోవడంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక భర్త వేధింపులు భరిస్తూ వచ్చింది. ఆదివారం భార్యాభర్తల మధ్య ఏమి జరిగిందో తెలియదు కానీ, హేమలత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. హేమలత మెడపైన అనుమానాస్పదంగా గాయం ఉంది. ఆమె తండ్రి కోటే శ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మంగళవారం ఎఫ్ఐఆర్‌ను ఎస్పీ సతీష్‌కుమార్ చందాన గర్ పోలీసులకు పంపారు. చందానగర్ పోలీసులు దీనిపై మరో ఎఫ్ఐఆర్ నమోదు చేసుకుని గుంటూరు వచ్చి మృతదేహానికి పంచనామా, పోస్టుమా ర్టం నిర్వహించనున్నారు. కాగా కేసులో భర్త మురళి పరారయ్యాడు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధుడు బండారుపల్లి, నల్లపాడు రైల్వే స్టేషన్‌ల మధ్య మంగళవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వయసు సుమారుగా 65 నుండి 70 ఏళ్ల మధ్య ఉండవచ్చని రైల్వే పోలీసులు తెలిపారు. తెల్లని జుట్టు, తెలుపు రంగు హాఫ్ చొక్కా, తెలుపు రంగు లుంగి ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని సత్తెనపల్లిలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ మార్చురీలో భద్రపరిచామని పోలీసులు తెలిపారు. ఇతనికి సంబంధించిన వారు నడికుడి రైల్వే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. రైల్వే పోలీసు స్టేషన్ ఎస్సై రోశయ్య 83093 69916, రైటర్ 99490 63960 నంబర్లకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

నకిలీపత్రాలు సమర్పించిన న్యాయవాదుల తొలగింపు

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : న్యాయ విద్యకు సంబంధించి నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి న్యాయవాదులుగా చలామణీ అవుతోన్న 17మంది నకిలీ న్యాయవాదులపై వేటు పడింది. వారిని రాష్ట్ర బార్ కౌన్సిల్ నుంచి తక్షణమే తొలగిస్తూ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత ఆదేశాలు జారీ చేశారు. న్యాయవాదులుగా నమోదు అయ్యే సమయంలో రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు వీరంతా అర్హత లేకుండా తప్పుడు మార్గంలో విద్యకు సంబంధించిన ధ్రువపత్రాలు సమర్పించారు. రాష్ట్ర ఎన్‌రోల్‌మెంట్ కమిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఈ అంశాన్ని తెలియజేయగా, ఏపీ బార్ కౌన్సిల్ నుండి వారి పేర్లు తొలగించాల్సిందిగా ఆదేశాలు అందాయి. ఈ జాబితాలో తెనాలి నాజర్‌పేటకు చెందిన డి.చాముండేశ్వరీ, గుంటూరు అమరావతిరోడ్డులోని పోస్టల్‌కాలనీకి చెందిన డి.రత్నకుమారి, చౌడవరం శివారు దాసరిపాలేనికి చెందిన యాదాల సురేష్‌బాబు ఉన్నారు.

రవీంద్ర నగర్‌లో చోరీ

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని రవీంద్రనగర్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. రాధా రమణరావు కుటుంబంతో ఈనెల 6న హైదరాబాద్ వెళ్లారు. 12న తిరిగి ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి దొంగలు ఇంట్లో ప్రవేశించారు. బీరువాలో ఉన్న మూడు కిలోల వెండి, ఆరు గ్రాముల బంగారు ఆభరణాలు, కొంత నగదు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది.

మహిళా వాచ్‌మన్‌పై దాడి ఘటనపై కేసు నమోదు

శ్యామలానగర్ మూడో లైన్‌లో మహిళా వాచ్‌మన్‌పై దాడి చేసిన ఫ్లాట్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శ్యామలనగర్ లోని సాయి డ్రీమ్ కాజల్ అపార్టుమెంట్‌కు చెందిన రమాదేవి మంగళవారం తన ద్విచక్ర వాహనంపై అపార్టుమెంట్‌లోకి వస్తుండగా గేటు బయట ఇతర వాహనాలు అడ్డుగా పార్కింగ్ చేశారు. దీంతో ఆగ్రహంతో రమాదేవి వాచ్‌మన్ భార్యపై దాడి చేసి కొట్టింది. బాధితురాలు లక్ష్మీ ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులతో డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ తదితరులు

సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తాచాటిన కేఎల్‌పీ స్కూల్ విద్యార్థులు

గుంటూరు(విద్య), మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్ విద్యార్థులు సీబీఎస్ఈ విడుదల చేసిన 10, 12వ తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తరగతిలో మొత్తం 70 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని అందులో 34 మంది ప్రథమ శ్రేణిలో, 14 మంది డిస్టింక్షన్లో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అదేవిధంగా 10వ తరగతి పరీక్షకు 144 మంది విద్యార్థులకు గాను 127 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో, 64 మంది డిస్టింక్షన్ మార్కులతో ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. ఇందులో 15 మంది విద్యార్థులు 90 శాతం పైగా మార్కులు సాధించారని వివరించారు. తమ విద్యార్థిని పి.సాత్విక 482 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఏవో వెంకట్రావు, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, అకడమిక్ కో ఆర్డినేటర్ బి.శైలజ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

విజ్ఞాన్ విజయకేతనం



కె.సంపత్‌రెడ్డి

గుంటూరు(విద్య), మే 13 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి సీబీఎస్ఈ ఫలితాల్లో విజ్ఞాన్ విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థి కె.సంపత్‌రెడ్డి 500 మార్కులకుగాను 483 మార్కులు సాధించారని తెలిపారు. అదేవిధంగా రావడ హనీష్ 477 మార్కులు సాధించారని వివరించారు. అదేవిధంగా 450 మార్కులకు పైన 10 మంది విద్యార్థులు, మొత్తం 400 మార్కులు పైన 40 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు విజ్ఞాన్ సంస్థల అధినేత లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, జోనల్ ఇన్‌చార్జ్ అనురాధ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ జయభేరి



చల్లా లలిత శరణ్య, నిధి తోష్నివాల్, ఈపూరి విజయసారథి

గుంటూరు (విద్య) మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ ప్రకటించిన పదవ తరగతి, 12వ తరగతి ఫలితాల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (అమరావతి) విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ చుక్కపల్లి రాజేష్ మంగళవారం తెలిపారు. తమ విద్యార్థులు 10, 12వ తరగతిలో నూరు శాతం ఫలితాలు నమోదు చేస్తున్నారని వివరించారు. 12వ తరగతిలో సాయి దరహాస 96.2, కోమ్మనబోయిన మహేష్ కుమార్ 94.2, కౌశిక్ సాయి పబ్బిశెట్టి 91 శాతం మార్కులు సాధించారని వివరించారు. అదేవిధంగా పదవ తరగతిలో చల్లా లలిత శరణ్య 98.4 శాతం, నిధి తోష్నివాల్ 97.4, ఈపూరి విజయసారథి 96.4 శాతం మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను పాఠశాల వైస్ చైర్మన్ చుక్కపల్లి రమేష్, చుక్కపల్లి ప్రియాంక, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఉషారాణి, ప్రిన్సిపల్ రత్నమాల తదితరులు అభినందించారు.

ప్రొడిజీ విద్యాలయ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు (విద్య) మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ విడుదల చేసిన పదవ తరగతి ఫలితాల్లో స్థానిక బుడంపాడులోని ప్రొడిజీ విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ ఎం.సాంబశివరావు మంగళవారం తెలిపారు. పరీక్షకు మొత్తం 28 మంది హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. ఇందులో ఏ రామ్ చరణ్ 96 శాతం, వై.భవిష్య 95 శాతం, ఎస్‌కే హాఫీజ్ 94 శాతం మార్కులతో అగ్రస్థానంలో నిలిచారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ వై.రజిని చౌదరి, కార్యదర్శి ఎం.సూర్యకుమారి అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఎం.సాంబశివరావు తదితరులు

సీతారామయ్య హైస్కూల్ విద్యార్థులు...

గుంటూరు కార్పొరేషన్, మే 13(ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ బోర్డు మంగళవారం ప్రకటించిన 10వ తరగతి ఫలితాల్లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో సీబీఎస్ఈ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. తమ పాఠశాల మూడవ బ్యాచ్ నుంచి పరీక్షలు రాసిన 80 మంది విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. పాఠశాల గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీ, అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు విద్యార్థులను, ఉపాధ్యా యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసా దరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, సీనియర్ కోఆర్డినేటర్ దుర్గాశ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌కు అభినందనలు



జవహర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా మాజీ మంత్రి కేఎస్ జవహర్‌ను నియమించటంపై మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్, పలువురు నాయకులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడలోని కార్యాలయంలో మంగళవారం మాజీ మంత్రి జవహర్‌ను కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. దేవపాల్ మాట్లాడుతూ చైర్మన్‌గా తొలిసారి మాదిగ సామాజికవర్గానికి కేటాయించటంపై సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో నాయకులు కేఎన్ సుకుమార్, కిరణ్, కిషోర్, విజయ్ తదితరులున్నారు.

రెండేళ్ల పాటు కొనసాగనున్న వడ్డెర కార్పొరేషన్ చైర్మన్

● ఉత్తర్వులు జారీ చేసిన బీసీ సంక్షేమ శాఖ

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మల్లె ఈశ్వరరావు నియామకం అధికారికంగా వెలువడింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ ఎస్.సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మల్లె ఈశ్వరరావు రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు.

40 రేషన్ బియ్యం బస్తాలు స్వాధీనం

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్ పేట పోలీసులు రాజీవ్ గాంధీ నగర్ లో 40 బస్తాల రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న లారీని అడ్డుకున్నారు. పోస్టల్ కాలనీ నాలుగో లైన్ నుంచి చంద్రశేఖర్‌రెడ్డి ఈ రేషన్ బియ్యాన్ని అక్రమంగా వెనిగండ్లకు తరలిస్తున్నారు. డ్రైవర్ ఆలీని అదుపులోకి తీసుకొని విచారించగా తనను చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి బాడుగకు పిలవడంతో వచ్చానని తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని, వాహనాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

రైతులకు అవగాహన ఎక్కడ.?

గ్రామీణ విత్తనోత్పత్తి పథకం కింద రైతులు పండించిన పంట శాంపిల్స్ ఇక్కడ పరీక్షించి, నాణ్యత తెలుసుకొని విత్తనాలకు విక్రయించుకునే అవకాశం ఉంది. బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌లో 2,71,954 ఎకరాలు, రబీలో 3,25,961 ఎకరాలు సాగయ్యాయి. కానీ, ఇన్నేళ్లలో కేవలం 450 మంది రైతులు మాత్రమే అగ్రి ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకున్నారంటే అధికారులు రైతులకు ఏమేరకు అవగాహన కల్పిస్తున్నారో అర్థమవుతుంది. బాపట్ల ల్యాబ్‌లో ఏఈవో గొర్ల శ్రావణ బిందు సీడ్ పరీక్షలు చేస్తుంది. ఏడీఏ పర్యవేక్షణలో ఒక ఏవో, ఇద్దరు ఏఈవోలు ఇక్కడ పనిచేయాల్సి ఉంది. ఇక్కడకు ఎక్కువమంది రైతులు రావడం లేదని మిగిలిన వారిని డిప్యూటేషన్ మీద పంపించారు. వచ్చే ఖరీఫ్‌కు రైతులు ల్యాబ్‌ను వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

మత్స్యశాఖ ల్యాబ్

ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లోని ఓ విభాగంలో ఫిషరీస్ ల్యాబ్ ఉంది. ఇక్కడ ఒక ఎఫ్‌డీవోతో పాటు ఇద్దరు సాగర మిత్రలు పనిచేస్తున్నారు. ఆక్వా సాగు చేసే రైతులు ఇక్కడకు వచ్చి నీటిలో ఆక్సిజన్ పరిమాణం, క్షారత్వం, ఆమ్లత్వం, లవణీయత, మెగ్నీషియం, కాల్షియం, కాఠిన్యం, అమోనియం వంటి పరీక్షలు చేయించుకోవచ్చు. 2023లో దీనిని అందుబాటులోకి తెచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం 591 శాంపిల్స్ మాత్రమే రైతుల నుంచి వచ్చాయి. జిల్లాలో 20,389మంది రైతులు అధికారికంగా ఆక్వా సాగు చేస్తున్నారు. వీరంతా ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి, నష్టపోతున్నారు. చేపలు, రొయ్యల చెరువులలో సూర్యోదయానికి ముందు లీటరు నీరు తీసుకొని ల్యాబ్‌కు తీసుకొస్తే పరీక్షలు చేసి, ఫలితాలను చూపిస్తారు. లేదా అధికారులకు సమాచారం ఇస్తే వారే వచ్చి నీటిని తీసుకెళ్లి పరీక్ష చేసి, వివరాలు తెలియజేస్తారు.


బాపట్ల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవనం


విత్తనాల నాణ్యతను పరీక్షిస్తున్న ఏఈవో శ్రావణబిందు

అన్నీ ఉన్నా.. అవగాహనేదీ..?

- లక్ష్యం చేరని బాపట్ల ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్
- ఇక్కడే విత్తన, ఎరువు, పురుగు మందుల నాణ్యత పరీక్షలు
- పశుసంవర్ధక, మత్స్య శాఖలకు ప్రత్యేక ల్యాబ్‌లు
- అవగాహన లేక ఆసక్తి చూపని రైతులు
- ఇంకా ప్రైవేట్ ల్యాబ్‌లకే ఆక్వా సాగుదారుల పరుగులు

బాపట్ల, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సు కోసం తీసుకొచ్చిన ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు లక్ష్య సాధనలో వెనుకబడ్డాయి. ల్యాబ్ సేవలను కర్షకులు సద్వినియోగం చేసుకునేలా చేయడంలో పూర్తి నిర్లక్ష్యం కనిపిస్తోంది. నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని ఎరువులు, పనిచేయని పురుగు మందులను గుర్తించాలంటే అన్నదాతలకు చాలా కష్టం. వీటి నాణ్యత తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ అగ్రి ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆక్వా సాగుకు ఊతమిచ్చేందుకు ఫిషరీస్ ల్యాబ్, పశువులకు కృత్రిమ గర్భధారణకు అవసరమైన పరీక్షల ల్యాబ్‌ను ఒకేచోట ఏర్పాటు చేసింది. బాపట్ల వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణంలో నాబార్డు ఆర్‌కేవీవై నుండి రూ.90 లక్షల వెచ్చించి ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవన సముదాయ నిర్మాణం చేపట్టారు. అందులో పరీక్షలకు అవసరమైన విలువైన యంత్రపరికరాలు సమకూర్చడం జరిగింది. జిల్లాలోని బాపట్లతో పాటు రేపల్లె, చీరాల నియోజకవర్గాల్లో ఈ ల్యాబ్‌లు ఉన్నాయి.

పశుసంవర్ధక ల్యాబ్ ఊసేలేదు

బాపట్ల ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌లో పశుసంవర్ధక శాఖకు ఓ ల్యాబ్‌ను కేటాయించారు. ఒక గదిలో అవసరమైన సామగ్రి ఏర్పాటు చేశారు. అయితే ఆ శాఖ అధికారులు.. అక్కడ ఉన్న పరికరాలు మొత్తం జిల్లా కార్యాలయం దగ్గర ఉన్న ల్యాబ్‌ను తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. వీటిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన విధంగా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి అధిక ఉత్పత్తుల సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


పశుసంవర్ధక శాఖ విభాగంలో ఖాళీగా కుర్చీలు

మరోసారి గుంటూరు మహిళకు..

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ
- ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
- గతంలో నన్నపనేని రాజకుమారికి అవకాశం
- కమిషన్‌పై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి


డాక్టర్ రాయపాటి శైలజ


నన్నపనేని రాజకుమారి

గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): మహిళా హక్కులను కాపాడే కీలకమైన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో మరోసారి గుంటూరు జిల్లాకు దక్కింది. చట్టబద్ధమైన ఈ పదవిలో నియమితులైన వారిని పదవీకాలం పూర్తయ్యే వరకు తొలగించే హక్కు ఎవరికీ లేదు. మహిళలను ఎంతగానో గౌరవించే సీఎం చంద్రబాబు నాయుడు 2014లో అధికారంలోకి రాగానే నన్నపనేని రాజకుమారిని ఈ పదవికి ఎంపిక చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రిగా, టీడీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేసిన రాజకుమారి రాష్ట్రంలో ఎక్కడ ఏ మహిళకు ఆపద వచ్చినా హుటాహుటిన వెళ్లి బాధితులకు అండగా నిలిచారు. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవికే వన్నె తెచ్చారు. మహిళల వివాహ వయసు 18 నుంచి 22 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వానికి రాజకుమారి సిఫారసు చేశారు. అప్పట్లో ఆమె పదవీకాలం ఐదేళ్లుగా నిర్ధారించటమే కాకుండా, కేబినెట్ హోదా కల్పిస్తూ చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే.. ఇబ్బందులు ఎదురవుతాయనే భయంతో మూడున్నరేళ్లకే ఆమె తన పదవికి రాజీనామా చేశారు. తిరిగి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గుంటూరు జిల్లాకు చెందిన మహిళనే ఆ పదవికి ఎంపిక చేసింది. సీనియర్ పార్లమెంటేరియన్‌గా పేరొందిన వయోభారంతో ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకున్న రాయపాటి సాంబశివరావు సోదరుడి కుమార్తె డాక్టర్ రాయపాటి శైలజకు ఈ పదవిని కట్టబెట్టారు. అమరావతి రాజధాని నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన రైతుల ఉద్యమానికి శైలజ సంపూర్ణ సహకారం అందించారు. ఆమె పోరాట పటిమను గుర్తించిన చంద్రబాబు ఈ పదవికి ఎంపిక చేశారు. అయితే శైలజకు ప్రస్తుతానికి రెండేళ్ల పాటే పదవిలో కొనసాగే అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ హోదాను కూడా తదుపరి ఉత్తర్వుల్లో కల్పించే అవకాశం ఉంది. కాగా ఆమె పనితీరును బట్టి పదవీకాలాన్ని పొడిగించే అవకాశం ఉన్నట్లు కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విశేషమేమిటంటే రాజకుమారి, శైలజకు బంధుత్వం ఉంది.

విద్యుత్‌శాఖలో బదిలీలపై సందిగ్ధం

- నూతన కార్యవర్గంతో తాత్కాలికంగా బ్రేక్
- కొత్త సర్కిల్స్‌కు ఉద్యోగుల విముఖత

గుంటూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ (ఏపీ సీపీడీసీఎల్)లో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ పూర్తి సందిగ్ధంలో పడింది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల సీపీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లాను మూడు సర్కిల్స్‌గా విభజించారు. ఈ మేరకు ఉద్యోగుల విభజన ప్రక్రియలో తాత్సారం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో గుంటూరు సర్కిల్‌గా ఉన్న జిల్లాను గుంటూరు టౌన్-1 , తెనాలి డివిజన్‌తో కలిసి గుంటూరు సర్కిల్‌గా, నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లతో పల్నాడు సర్కిల్‌గా, బాపట్ల డివిజన్, అద్దంకి, చీరాల డివిజన్‌లతో బాపట్ల సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. సర్కిల్స్‌ను ఏర్పాటు చేసినప్పటికీ ఉద్యోగులు లేరు, కనీసం కంప్యూటర్లు వంటి మౌలిక సదుపాయాలు కూడా లేని పరిస్థితి నెలకొంది. కొత్త సర్కిల్స్‌లో ఉద్యోగులు తప్పనిసరి అని ఎస్‌ఈలు ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో కొత్త సర్కిల్స్‌కు ఉద్యోగుల విభజన ప్రక్రియ చేపట్టాలని సంస్థ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇక ప్రక్రియ పూర్తయి బదిలీలకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో కొత్త కార్యవర్గం నియామకంతో తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.

ఆదేశాలు జారీ చేసినా..

కొత్త సర్కిల్స్ విభజన నేపథ్యంలో గుంటూరు సర్కిల్ కార్యాలయం నుంచి 13 మంది పొరుగు సేవల ఉద్యోగులను బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసినా.. వారు వెళ్లని పరిస్థితి నెలకొంది. అసలే అరకొర వేతనాలతో కాలం వెళ్లదీస్తున్న తమను జిల్లాలు దాటించేలా బదిలీలు చేస్తే ఎలాఅని తొలి నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు.



బదిలీలకు బ్రేక్..

ప్రభుత్వం ఇటీవల ఏపీ సీపీడీసీఎల్ సీఎండీగా పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్‌గా ఆవుల మురళీకృష్ణయాదవ్‌తో పాటు ఇతర డైరక్టర్లతో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసింది. దాంతో బదిలీల వ్యవహారం ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం సీఎండీ పుల్లారెడ్డి గతంలో ఎస్‌పీడీసీఎల్‌లో డైరక్టర్‌గా వ్యవహరించిన సీనియర్ అధికారి, డైరక్టర్‌గా మురళీ కృష్ణయాదవ్ కూడా క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలిసిన అధికారి కావడంతో ఉద్యోగుల బదిలీల వ్యవహారం ఎలా చేయాలన్న దానిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కూడా సంస్థలోని ఓ ఉద్యోగ సంఘం నాయకులు ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి కూడా ఉద్యోగుల బదిలీలతో కొంత వ్యతిరేకత ఉందని, ప్రస్తుతానికి నిలుపుదల చేయాలని కోరినట్లు సమాచారం. బదిలీల ప్రక్రియ తాత్కాలికంగా పెండింగ్‌లో పెట్టిన ట్లు తెలిసింది. త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తారని ఓ అధికారి తెలిపారు.

వేసవిలో ఫీవర్లు.. వైరల్

- ఆందోళన లేదంటున్న వైద్యవర్గాలు



గుంటూరు మెడికల్, మే 13 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా వేసవి ముగిసి, తొలకరి ప్రారంభయ్యే జూన్‌లో విష జ్వరాలు విజృంభిస్తాయి. ఇవి సాధారంగా వైరల్ ఫీవర్లుగా (ఇన్‌ఫ్లూయెంజా వైరస్) వైద్యులు చెబుతారు. వాతావరణంలో సంభవించే మార్పుల కారణంగా ఇవి విజృంభిస్తాయి. ఎండలు మండుతున్న ప్రస్తుత తరుణంలోనూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైరల్ ఫీవర్లు వణికిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది నడి వేసవిలో వైరల్ జ్వరాలు ప్రబలడం విశేషం. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులే ఈ జ్వరాలకు కారణమని వైద్యులు చెబుతున్నారు. గత వారం జిల్లాలో కురిసిన వర్షాలు జ్వరాలకు కారణవుతున్నట్లు వైద్యులు అభిప్రాయపడుతున్నారు. ఐదారు రోజులుగా జ్వరాలు జిల్లాను చుట్టుముట్టాయి. జ్వరం, జలుబు, ముక్కు కారడం, గొంతులో మంట, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. కొందరు రోగుల్లో వీటితో పాటు డయేరియా, ఒళ్లు నొప్పులు ఉంటున్నాయి.



జాగ్రత్తలు పాటిస్తే చాలు


డాక్టర్ రేవూరి హరికృష్ణ

వారం రోజులుగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల ఓపీకి వస్తున్న జ్వర బాధితుల సంఖ్య పెరిగింది. రోగులు రెండు రోజుల పాటు బెడ్ రెస్ట్ తీసుకొని, ద్రవ పదార్థాలు అధికంగా సులువుగా కోలుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇవి అంత ప్రమాదకరం కాదని అమరావతి రోడ్‌లోని ప్రభుత్వ ఛాతి, శ్వాస కోస వ్యాధుల వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకంటి రఘు తెలిపారు. ఇవి సెల్ఫ్ లిమిటింగ్ ఫీవర్లు అని, మూడు, నాలుగు రోజుల్లో అవే తగ్గిపోతున్నాయని ఆయన వివరించారు. ప్లేట్ లెట్లు తగ్గడం, ఇతర ఇబ్బందికర పరిస్థితులు ఇప్పటి వరకు తాము గుర్తించలేదని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా ఫ్లూ వ్యాక్సినేషన్ చేయించుకోవడం ఉత్తమం అని అంటు వ్యాధుల వైద్యనిపుణులు రేవూరి హరికృష్ణ సూచిస్తున్నారు. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న ఈ వ్యాక్సిన్ తీసుకుంటే పూర్తి రణక్ష లభిస్తుందని చెబుతున్నారు.

రూ. కోట్లలో ఆడిట్ అభ్యంతరాలు

- ఎంపీడీవోలపై జడ్పీ సీఈవో ఆగ్రహం
- వాడివేడిగా సాగిన సమీక్ష సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, చిత్రంలో సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో కృష్ణ

గుంటూరు సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): 'నరసరావుపేటలో రూ. 2.60 కోట్లు.. మాచవరంలో రూ.కోటి.. గుంటూరు రూరల్ రూ.1.26 కోట్లు.. క్రోసూరు రూ.97 లక్షలు.. యడ్లపాడు రూ.80 లక్షలు.. ఏ మండల పరిషత్ చూసినా ఆడిట్ అభ్యంతరాలే.. అయినా ఎంపీడీఓలు పట్టించుకోవడం లేదు.. ఇంత నిర్లక్ష్యం అయితే ఎలా అంటూ..' జడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీఓలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో.. పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అధ్యక్షతన ఎంపీడీఓల సమీక్షా సమావేశం మంగళవారం వాడీవేడిగా కొనసాగింది. సీఈవో జ్యోతి బసు మాట్లాడుతూ ఎంపీడీవోలు బాధ్యత తీసుకొని ఆడిట్ అభ్యంతరాలు నిలుపుదల చేయించాలని సూచించారు. జడ్పీ ఆస్తుల పరిరక్షణపై డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ సమీక్ష నిర్వహిస్తూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది వివిధ రాజకీయ పార్టీల పేర్లు చెప్పి జిల్లా పరిషత్‌కు చెల్లించాల్సిన అద్దె బకాయిలు రూ.లక్షల్లో పెండింగ్ పెడుతున్నారని అన్నారు. పిడుగురాళ్ల జడ్పీ కాంప్లెక్స్ నుంచి గడచిన ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా అద్దె వసూలు కాలేదని చెప్పారు. అక్కడ రూ. 32 లక్షలు అద్దె బకాయి ఉందన్నారు. ఎంపీడీఓ అక్కడ కు వెళ్లి షాపులకు తాళాలు వేయాలని ఆదేశించారు. కొంతమంది జడ్పీ షాపింగ్ కాంప్లెక్స్ లోని గదులు రూ. 3 వేలకు అద్దెకు తీసుకొని రూ. 15 వేల అద్దెకు ఇస్తున్నారని వెల్లడించారు.

బల్లకట్టు తిరుగుతుంటే ఏం చేస్తున్నారు?

మాచవరం మండలం గోవిందా పురం బల్లకట్టు అనధికారికంగా తిప్పుతూ ఉండటం చర్చకు వచ్చింది. చైర్‌పర్సన్, డిప్యూటీ సీఈఓ కృష్ణ దీనిపై స్పందిస్తూ.. జడ్పీ ఆదాయానికి గండి కొడుతుంటే ఎంపీడీఓలు అధికారులు పట్టీపట్టనట్లు ఉండటం విచారకరమన్నారు. గోవిందాపురం వ్యవహారం లో పోలీసులకు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని సూచించారు. జడ్పీ ఆస్తుల పరిరక్షణ బాధ్యత ఎంపీడీఓలదేనని చైర్‌పర్సన్ స్పష్టం చేశారు.

జడ్పీ లేఖలకు రెక్కలు..!

జడ్పీ ఆస్తులకు సంబంధించిన వేలం పాటల వ్యవహారంలో కొందరు అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారన్న విషయం చర్చకు వచ్చింది. సంబంధిత అధికారులు మాట్లాడుతూ దాచేపల్లి మండలంలోని ఇరికేపల్లి, పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూముల వేలానికి సంబంధించిన లేఖలు జడ్పీ నుంచి ఎప్పటికప్పుడు మండలాలకు పంపామని చెప్పారు. దాచేపల్లి మండల అధికారులు మాట్లాడుతూ తమకు ఏ విధమైన లేఖలు రాలేదని ప్రతిస్పందించారు. అయితే లేఖలను మధ్యలో కాకులు ఎత్తుకుపోతున్నాయేమో అని అధికారులు పేర్కొన్నారు.

నూజెండ్ల వ్యవహారం..

సమావేశంలో నూజెండ్ల మండల పరిషత్ వ్యవహారం చర్చకు వచ్చింది. సిబ్బంది తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు. సిబ్బంది సరిగా విధులకు హాజరుకావడం లేదని, పైగా ఎంపీడీఓ వేధిస్తుంది అంటూ పత్రికల్లో తప్పుడు వార్తలు రాయిస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ ఉన్న సిబ్బందిని వెంటనే రీ-కాల్ చేయాలని ఎంపీడీఓ ఉమాదేవి జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మాచర్ల కంటి వెలుగు


డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి కంటి ఆసుపత్రి భవనం

- డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి కంటి ఆసుపత్రి సేవలు
- 46 వేల మందికి కంటి శస్త్ర చికిత్సలు
- సకల సదుపాయాలతో అధునాతన భవనం

మాచర్లటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని మాచర్లకు కంటి వెలుగైంది డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి కంటి ఆసుపత్రి. సర్వేంద్రియానం నయనం ప్రధానం.. అన్న నినాదాన్ని అందిపుచ్చుకుని పేదలకు కంటి శస్త్ర చికిత్సలు అందిస్తోంది. ఈ నియోజకవర్గంలో సుమారు 80 గిరిజన తండాలున్నాయి. అధికంగా బడుగు, బలహీన వర్గాలే ఇక్కడ జీవిస్తున్నాయి. వయస్సుపై బడిన తర్వాత కంటి శుక్లాలు, కంటిలో పొరలు, నీటి కాసులు వంటి సమస్యలొస్తే.. శస్త్ర చికిత్సలు చేయించుకునే ఇక్కడి వారికి లేదు. గతంలో వీరికి రోటరీ క్లబ్ ద్వారా ఐ క్యాంపులు నిర్వహించి, అపరేషన్ అవసరమైన వారిని పాలకొల్లు పంపించేవారు. అలా కాకుండా వెనుకబడిన పల్నాడు ప్రాంతంలోనే ప్రజలకు వైద్య సేవలందాలని మాచర్ల పట్టణంలోని సాగర్ రోడ్డులో 63 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుత బాపట్ల జిల్లా అమృతలూరు గ్రామానికి చెందిన డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు వృత్తి రీత్యా అమెరికాలో స్థిరపడ్డప్పటికీ.. ఆసుపత్రి నిర్మాణానికి సుమారు రూ. 3 కోట్లు విరాళంగా అందించారు. ఇంకో రూ. 5 కోట్ల నగదు దాతల నుంచి అందింది. దీంతో 2006లో డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి ఆసుపత్రిని నిర్మించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో శంకర కంటి ఆసుపత్రి తర్వాత ఆ స్థాయిలో ఇక్కడే సేవలు నిరుపేదలకు అందుతున్నాయి.

45 వేల కంటి శస్త్ర చికిత్సలు

ఆసుపత్రిలో ఇప్పటికి 45 వేల మందికి కంటి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. నీటి కాసుల పరీక్షలు, సీజన్లో వచ్చే అంటు వ్యాధుల ట్రీట్‌మెంట్ కూడా కొనసాగిస్తున్నారు. హాస్పిటల్‌లో అధునాతనమైన థియేటర్‌లో ల్యామినార్, సాధారణ థియేటర్‌లు ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో నుంచి 20 పడకల ఆసుపత్రి అనుమతి కూడా లభించింది. ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ సదుపాయాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. డిస్ట్రిక్ బ్లైండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ అనుసంధానంతో ఆధార్ కార్డు ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నారు. ఎన్‌పీసీబీ (నేషనల్ ప్రోగ్రాం కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్)తో అనుసంధానం చేయడం జరిగింది. పార్మసీ, అధునాతన ల్యాబ్, కళ్లజోళ్ల షాపు, రక్త పరీక్షల ల్యాబ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఇద్దరు డాక్టర్లు, 31 మంది స్టాఫ్‌తో నిరంతర సేవలు అందిస్తున్నారు.


డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మీనాక్షి దంపతులు

దాతృత్వంతో..ముందుకు

-చిరుమామిళ్ల కృష్ణయ్య
ఆసుపత్రి కమిటీ చైర్మన్

డాక్టర్ పీఎస్ఆర్ ఆంజనేయులు మీనాక్షి కంటి ఆసుపత్రి కమిటీ చైర్మన్ చిరుమామిళ్ల కృష్ణయ్య దాతల నుంచి సేకరించిన నగదుతో ఆసుపత్రిని కార్పోరేట్ స్థాయిలో నిలబెట్టారు. విరాళాల్లో కొంత భాగాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగిస్తున్నారు. ఎస్‌బీఐ ద్వారా సీఎస్ఆర్ గ్రాంటు రూ.70 లక్షల నిధులతో రెటీనా మిషన్ పరికరాలు అందజేశారు. చైర్మన్‌తో పాటు, కమిటీ సభ్యులు దాతల నుంచి భారీగా విరాళాలు సేకరించి, కార్పొరేట్ స్థాయిలో ఇక్కడ కంటి వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నారు.



దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 991 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.10,100, గరిష్టధర రూ.11,160, మోడల్‌ధర రూ.10,570 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.10,100, గరిష్టధర రూ.11,160 మోడల్‌ధర రూ.10,570 పలికాయి.

అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి

మంగళగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎంప్లాయిస్ యూనియన్ మంగళగిరి ఆర్టీసీ డిపో కార్యదర్శి బి.నాగేశ్వరరావు అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెండో రోజు మంగళగిరి బస్టాండు ఆవరణలో ధర్నా నిర్వహించారు. నాగేశ్వరరావుపై డిపో యాజమాన్యం ఏకపక్షంగా సస్పెన్షన్ విధించిందని ఆరోపించారు. ఈ ధర్నాలో ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ అధ్యక్షుడు ఎస్‌కే కరీముల్లా, డిపో అధ్యక్షుడు బి.సాంబశివరావు, గౌరవాధ్యక్షుడు చిన్ని సత్యనారాయణ, వీరయ్య ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

15న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

పెదనందిపాడు, మే, 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాగులపాడులో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థులు, దాతల సహకారంతో టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం, విశ్వవిఖ్యాతనటసార్వభౌమ, పద్మశ్రీ నందమూరి తారకరామారావు విగ్రహం ఏర్పాటు చేశారు. మే15న విగ్రహావిష్కరణ చేయనున్నట్లు గ్రామ అధ్యక్షుడు, బండి నాగబాబు మంగళవారం తెలిపారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం


కాకుమాను, మే 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైన ఘటన మండలపరిధిలోని కొండపాటూరులో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శేకర్ గడ్డిని తరలిస్తున్న తరుణంలో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. మండలపరిధిలోని అప్పాపురం నుంచి గడ్డి లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు కరెంట్ తీగలు తగిలి అగ్ని రవ్వలు రాజుకుని ట్రాక్టర్ ట్రక్కులో ఉన్న గడ్డి పూర్తిగా కాలిపోయింది. స్థానికులు మంటలను అదుపు చేశారు. విద్యుత్ సరఫరా నిలుపుదల చేయించడంతో పాటు మంటలు వ్యాప్తి చెందకుండా పెను ప్రమాదం తప్పింది.

ఘర్షణపై కేసు నమోదు

పెదనందిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టి గాయపరిచిన సంఘటనపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం స్థానిక రజక కాలనీకి చెందిన మేలిమి రమేష్ పండ్ల అమ్ముకుని జీవనం సాగిస్తుంటాడు. ఇంటి వద్ద వాహనం నిలపగా పక్కన ఇంటిలో ఉంటున్న లక్ష్మీ కుమారుడు ద్విచక్ర వాహనాన్ని పడవేయడంతో వాహనం డోమ్, అద్దాలు పగిలి పోయాయి. దీనిపై ఇరువురు మాట్లాడుకొని కొంత డబ్బులు చెల్లించాలని కోరారు. ఆదివారం బహిర్భూమికి వెళ్లిన రమేష్‌ను షేక్ చందావలి అనే వ్యక్తి అడ్డుకొని లక్ష్మీని డబ్బులు ఎందుకు అడుగుతున్నావు అంటూ అతనితో పాటు మరో ముగ్గురు కలిసి దుర్భాషలాడి, కొట్టి, చంపుతామని బెదిరించారు. దీంతో కాలికి బలంగా గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న కొందరు వ్యక్తులు గమనించి రమేష్‌ను 108వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుడు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుపవన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ నేతకు నివాళి

మంగళగిరి సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఆరో వార్డుకు చెందిన టీడీపీ నేత, విశ్రాంత ఏఎస్‌ఐ తాడిబోయిన వెంకటేశ్వరరావు మంగళవారం తెల్లవారుజామున హఠాన్మరణం చెందారు. టీడీపీ నేతలు వెంకటేశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్, నేతలు కారంపూడి అంకమ్మరావు, వాకా మాధవరావు, అన్నం నాగబాబు, గోసాల రాఘవ, జొన్నాదుల బాలకృష్ణ, కొదమల సైమన్ తదితరులు వెంకటేశ్వరరావుకు నివాళులు అర్పించారు.



దుగ్గిరాల మండలం కేఆర్‌కొండూరు గ్రామంలోని శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం అభివృద్ధి కోసం పెదకాకాని గ్రామస్థులు కె.శ్రీహరిబాబు, నాగేశ్వరి దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు. ఈవో కోగంటి సునీల్, వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్‌లు, దాతలకు పంచాంగంతో పాటు దేవస్థానం క్యాలెండర్‌ను అందించారు.
(దుగ్గిరాల,ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సీఐటీయూ

పిరంగిపురం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మే నెల 20వ తేదీన లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు బీ లక్ష్మణరావు కోరారు. మంగళవారం పిరంగిపురంలోని పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం చేపట్టి కార్పోరేట్ విధానాలను వేగవంతం చేసిందని ఆయన విమర్శించారు. దీని వల్ల నిరుద్యోగం పెరిగి ఉపాధి గ్యారెంటీ లేక కార్మికులు అల్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఇబ్రహీం, వెంకటేశ్వర్లు, శ్రావణ్, హనోక్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల చెంతకు బహుళ ప్రయోజన సౌకర్య గోదాము

- 82 లక్షల వ్యయంతో తిమ్మాపురంలో నిర్మాణం
- వెయ్యి టన్నుల సామర్థ్యం
- ప్రారంభోత్సవానికి రానున్న పెమ్మసాని, అచ్చెన్నాయుడు

ప్రత్తిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలు నిల్వ ఉంచుకోవడంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు ఉత్పత్తులను కొనుగోలు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం బహుళ ప్రయోజన సౌకర్య గోదామును ఏర్పాటు చేసింది. మండల పరిధిలోని తిమ్మాపురంలో రూ.82 లక్షల వ్యయంతో నియోజకవర్గంలో అత్యంత పెద్దదైన వెయ్యి టన్నుల సామర్థ్యం గల గోదాము నిర్మాణం పూర్తయి నేతల చేతుల మీదగా ప్రారంభోత్సవం కానుంది. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, తిమ్మాపురం సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు కృషితో ఈ నిర్మాణం పూర్తయింది. పాతమల్లాయపాలెం సొసైటీ పరిధిలో మార్కెటింగ్ శాఖ ద్వారా గోదాము నిర్మాణం మంజూరైంది. అయితే తొలుత ఈ గోదాము నిర్మాణానికి అవసరమైన స్థలం ఇచ్చేందుకు దాతలు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఈ సొసైటీ పరిధిలోని తిమ్మాపురంలో నిర్మాణం చేయడానికి కల్లూరి శ్రీనివాసరావు నడుం బిగించాడు. గ్రామానికి చెందిన దొప్పలపూడి సాంబశివరావు హైదరాబాదులో నివాసం ఉంటారు. స్వగ్రామానికి సాయం అందించేందుకు సాంబశివరావు, ఉమాదేవి దంపతులు తన 51 సెంట్ల భూమిని గిడ్డంగికి ఇచ్చారు. వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో పనులు వేగవంతంగా జరిగి ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.



స్థల దాతలు దొప్పలపూడి సాంబశివరావు, ఉమాదేవి



తిమ్మాపురంలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన గోదాము

రైతులకు బహుళ ప్రయోజనాలు

తిమ్మాపురంలో నిర్మాణమైన ఈ గోదాము వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు లభించనున్నాయి. అన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన గోదాములు 500 టన్నుల సామర్థ్యం మాత్రమే కలిగి ఉన్నాయి. కాని ఇక్కడ ఏర్పాటు చేసిన గోదాము వెయ్యి టన్నుల సామర్థ్యం కలిసి ఉంటుంది. దీని వల్ల రైతులు తాము పండించిన వరి, శనగలు, అపరాల పంటలను నిల్వ చేసుకోవడానికి ఉపయోగ పడుతుంది. అంతే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయడానికి ఇక్కడ అవకాశం దొరుకుతుంది. ఇప్పటివరకు ప్రత్తిపాడు ప్రాంతంలో ఈ అవకాశం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

రేపు గోదాముకు ప్రారంభోత్సవం

ఈ నెల 15వ తేదీన గోదామును రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు చేతుల మీదగా ప్రారంభోత్సవం చేయనున్నారు. ఆయనతో పాటు వివిధ పనులను ప్రారంభించడానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులులు రానున్నారు. ఇందుకు సంబంధించి గ్రామ సర్పంచ్ కల్లూరి శ్రీనివాసరావు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు.

కనుల పండువలా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

- వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదానం

పెదనందిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులపాడు శ్రీశృంగేరి శారదా పీఠపాలిత శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారు స్వయంభూ పుట్ట 47వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ కన్నుల పండువగా జరిగింది. వేదపండితులు శెనగల సత్యనారాయణశర్మ, చిట్టా పవన్‌కుమార్‌శర్మ, పాటిబండ్ల త్రినాథ్‌శర్మలు శాస్త్రోక్తంగా దంపతులతో కల్యాణ క్రతువు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కల్యాణాన్ని వీక్షించి, వేదాశీర్వచనాలు అందుకున్నారు. భక్తులు మొక్కుబడులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్థులు, దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. కార్యక్రమాలను కమిటీ చైర్మన్ గొల్లపూడి సాంబశివరావు, సభ్యులు నంగినేని సింగయ్య, దాసరి సత్యనారాయణ, ఆళ్ల విజయ్‌కుమార్, పాటిబండ్ల సుబ్బారావు, కన్నెగంటి చలమయ్యలు పర్యవేక్షించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ మధు పవన్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణంలో పాల్గొన్న దంపతులు, భక్తులు

భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ..

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులకు రైతన్న డెయిరీ వారు ఉచిత మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. బాపట్ల రహదారిలో నాగులపాడు అడ్డరోడ్ వద్ద, దేవస్థానం సమీపంలో రెండు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, తాగునీరు అందజేశారు. మండు వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చిన రైతన్న డెయిరీ ఎండీ కమ్మ నాగమల్లేశ్వరరావుకు మరియు యాజమాన్యానికి గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శివాలయం అభివృద్ధికి కృషి చేయాలి

మంగళగిరి సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన ట్రస్టుబోర్డు సభ్యులు శివాలయం అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు కోరారు. మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం (శివాలయం) నూతన ట్రస్టుబోర్డు చైర్మన్, సభ్యుల అభినందన సభ ఎంఎంకే స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేశారు. టీడీపీ నేత కొత్తపల్లి శ్రీనివాసరావు, మిత్ర బృందం ఆధ్వర్యంలో చైర్మన్ బోగి కోటేశ్వరరావు, సభ్యులు సుఖమంచి గిరిబాబు, తిరుమలశెట్టి మురళీ కృష్ణలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా పరుగులు పెడుతుందన్నారు. మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో మంగళగిరి నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ దేశానికే రోల్ మోడల్‌గా నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నారని చెప్పారు. నూతన ధర్మకర్తలు శివాలయం అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, నేతలు విన్నకోట శ్రీనివాసరావు, చీకుల వెంకటేశ్వరరావు, మునగపాటి మారుతీరావు, షేక్ హుస్సేన్, రేఖా సుధాకర్‌గౌడ్, గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అభినందన సభలో మాట్లాడుతున్న పోతినేని శ్రీనివాసరావు

డిజిటల్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి

● సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సంస్థ(ఆర్డిడ్స్) కార్యదర్శి సాంబశివరావు


తాడికొండ, మే 13(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు డిజిటల్ లావాదేవీలపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సంస్థ(ఆర్డిడ్స్) కార్యదర్శి వై సాంబశివరావు తెలిపారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆర్డిడ్స్, ఆర్‌బీఐ ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్‌పై యానిమేటర్లు, డ్వాక్రా గ్రూప్ సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు రోజు రోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. డిజిటల్ లావాదేవీలపై అవగాహన లేని వారు సైబర్ మోసాలకు గురైతున్నారన్నారు. దీంతో ఎంతో మంది ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. గుర్తుతెలియని నెంబర్ల నుంచి ఫోన్లు చేయటం, బ్యాంకుల నుంచి, సీబీఐ, సీఐడీ, పోలీస్, కస్టమ్స్ అంటు ఫోన్లు చేసి ఓటీపీ నెంబర్లు, బ్యాంకు అకౌంట్ వివరాలు చెప్పమని ఫోన్లు వస్తే ఎవరు స్పందించవద్దని తెలియజేశారు. ఆర్‌బీఐ రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్‌బీఐ కచ్చితమైన రూల్స్‌ను పాటిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రావూరి సాంబశివరావు, ఆర్ శంకరరావు, ఎస్‌కే హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డిడ్స్ కార్యదర్శి సాంబశివరావు

ముఖ్యమంత్రి సహాయనిధి నగదు చెక్కుల పంపిణీ

దుగ్గిరాల, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్యఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నగదు చెక్కులను మంగళవారం అందించారు. చిలువూరు గ్రామానికి చెందిన మెడబలిమి నరేంద్రకు రూ.59,909, రేవేంద్రపాడు గ్రామస్థుడు నూతక్కి విజయరావుకు రూ.1,84,189లు, పెనుమూలికి చెందిన షేక్ నాగుల్లాకు రూ.66,270, చింతలపూడికి చెందిన నల్లనూకల వెంకటరామయ్యకు రూ.1,88,005, శృంగారపురంకు చెందిన శృంగారపాటి మరియమ్మకు రూ.62,466, ఈమనికి చెందిన బెల్లకొండ శ్రీనివాసరావుకు రూ.54,900 చొప్పున నగదు చెక్కులను అందించారు. ఎంపీపీ షేక్ జబీన్, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కును బాధితులకు అందిస్తున్న ఎంపీపీ జబీన్, శ్రీఅనిత తదితరులు

చలివేంద్రానికి నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

తాడేపల్లి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి కూడలిలో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు అక్కడ ఉన్న చలివేంద్రానికి నిప్పు పెట్టడంతో చలివేంద్రం పూర్తిగా దగ్ధమైంది. ఎంతో మందికి దాహార్తి తీరుస్తున్న ఈ చలివేంద్రానికి తాగిన మత్తులో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని చలివేంద్రం నిర్వాహకులు వ్యాఖ్యానిస్తున్నారు.

హత్యా.. ఆత్మహత్యా..?

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతిపై అనుమానాలు
- పెద్దలను ఎదురించి కులాంతర వివాహం
- చందానగర్ పోలీసులు వచ్చాకే పోస్టుమార్టం

గుంటూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో వివాహిత అనుమానాస్పద మృతి కేసులో అనుమానాలు ముసురుకుంటున్నాయి. భర్త రెండో కంటికి తెలియకుండా మృతదేహాన్ని స్వగ్రామం ఓబుల్‌నాయుడుపాలెం తీసుకురావడం కలకలం రేపింది. దీంతో మృతురాలి తండ్రి ఫిర్యాదుతో.. మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. చందానగర్ పోలీసులు వచ్చి మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం నిర్వహించాల్సి ఉంది. వివరాల్లోకి వెళితే.. ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామానికి చెందిన హేమలత, ఓబుల్‌నాయుడుపాలెం గ్రామానికి చెందిన మురళి ప్రేమించుకున్నారు. కులాలు వేరు కావడంతో హేమలత కుటుంబ సభ్యులు వీరి ప్రేమను అంగీకరించలేదు. దీంతో హేమలత తల్లిదండ్రులను ఎదిరించి మురళిని వివాహం చేసుకుంది. హేమలత హైదరాబాదులోని ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. లింగంపల్లి ప్రాంతంలో భార్యభర్తలు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. పిల్లలు ఓబుల్‌నాయుడుపాలెంలోని మురళి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. మురళి జులాయిగా తిరుగుతూ.. బెట్టింగ్‌లకు అలవాటుపడి డబ్బులు కోసం నిత్యం భార్యను వేధింపులకు గురిచేస్తున్నాడు. హేమలత తన శక్తికి మించి అప్పులు చేసి అడిగినంత భర్తకు ఇచ్చింది. తల్లిదండ్రులను ఎదిరించి పెళ్లి చేసుకోవడంతో ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక భర్త వేధింపులు భరిస్తూ వచ్చింది. ఆదివారం భార్యాభర్తల మధ్య ఏమి జరిగిందో తెలియదు కానీ, హేమలత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని భర్త గుట్టుగా ఓబుల్‌నాయుడుపాలెం తీసుకువచ్చాడు. హేమలత మెడపైన అనుమానాస్పదంగా గాయం ఉంది. కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె తండ్రి కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసు లు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. మంగళవారం ఎఫ్‌ఐఆర్‌ను ఎస్పీ సతీష్‌కుమార్ చందానగర్ పోలీసులకు పంపారు. చందా నగర్ పోలీసులు దీనిపై మరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసుకుని గుంటూరు వచ్చి మృతదేహానికి పంచనామా, పోస్టుమార్టం నిర్వహించనున్నారు. కాగా కేసులో నిందితుడైన మురళి పరారయ్యాడు.

19న మండల ఉపాధ్యక్ష ఎన్నిక

దుగ్గిరాల, మే 13: దుగ్గిరాల మండల ఉపాధ్యక్ష ఎన్నికను ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అడిగొప్పుల శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

కార్మికహక్కులను కాలరాసేలా చట్టాలు

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీ. లక్ష్మీనారాయణ

దుగ్గిరాల, మే 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చాక కార్మిక హక్కులను కాలరాసే చట్టాలను రూపొందిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీ. లక్ష్మీనారాయణ ఆరోపించారు. దుగ్గిరాల ముర్తుజానగర్ షాదీఖానా ఆవరణలో మంగళవారం సాయంత్రం జరిగిన సీఐటీయూ సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్మికులు మాట్లాడే హక్కు, సంఘాలు పెట్టుకునే హక్కులను కూడా లేకుండా చేస్తున్నారని అన్నారు. రైతుపండించిన పంటకు గిట్టుబాటుధర విధిగా అందించేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మే 20వతేదీన జరిగే సమ్మెను విజయవంతం చేయాలన్నారు. జిల్లా కౌలురైతుసంఘం కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కౌలురైతులకు భూయజమానులతో నిమిత్తం లేకుండా బ్యాంకులద్వారా రుణాలు అందించాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, సీపీఐ మండల కార్యదర్శి గొర్రిపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ పేదలకు పదివేల పింఛను ఇవ్వాలి

తాడేపల్లి (చిర్రావూరు), మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నివసించే 60 సంవత్సరాలు నిండిన పేదలకు పది వేల రూపాయల పింఛ ను అందజేయాలని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని చిర్రా వూరులో మంగళవారం ఉదయం ప్రజాసంఘాల నాయకులు ఈ నెల 20న జరుగు సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు.

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు

● రూ.12.10 లక్షల అపరాధ రుసుం విధింపు

మంగళగిరి సిటీ, మే 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మంగళగిరి డీ-1 సెక్షన్ పరిధిలో విస్తృత తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ పర్యవేక్షక ఇంజనీరు బీ విజయకృష్ణ, సీఆర్డీఏ సర్కిల్ ఆపరేషన్స్ పర్యవేక్షక ఇంజనీరు పీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 46 మంది అధికారులు, 189 మంది సిబ్బంది బృందాలుగా విడిపోయి వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. మొత్తం 3,121 సర్వీసులను తనిఖీ చేయగా, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరికి రూ.53 వేలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరీలో విద్యుత్ వినియోగిస్తున్న 9 మందికి రూ.లక్షా 20 వేలు, అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుతున్న 124 మందికి రూ.10.37 లక్షల చొప్పున అపరాధ రుసుం విధించినట్లు విజిలెన్స్ డీపీఈ ఈఈ సీహెచ్ వేంకటేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో విద్యుత్‌శాఖ డీఈఈలు కే రవికుమార్, ఎన్ మల్లికార్జునప్రసాద్, జీ సురేష్‌బాబు, ఎం సతీశ్ కుమార్, ఏఈలు యూ శివశంకర్, వి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భారత సైన్యానికి దైవ బలం చేకూరాలి

మంగళగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో భారత సైనికులకు దైవ బలం చేకూరాలని ఏపీఎం ఎస్ఐడీసీ చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్‌ఆర్ కన్వెన్షన్‌లో ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో ప్రత్యేక జోహర్ దువా నమాజ్ నిర్వహించారు. మౌలానా మస్తాన్ సాబ్ నజ్మీ నేతృత్వంలో ఈ ప్రార్థనలు జరిగాయి. చిల్లపల్లి మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ముస్లింల ఆధ్వర్యంలో ప్రత్యేక దువా నిర్వహించినట్లు తెలిపారు. అమాయకుల ప్రాణాలను తీస్తున్న టెర్రరిస్టులకు ఇస్లాం పేరెత్తే అర్హత కూడా లేదన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన భారత సైనికుల ఆత్మకు శాంతి చేకూరాలని, ఇరు దేశాల మధ్య సత్సం బంధాలు మెరుగుపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ మీర్జా ఆబిద్ హుస్సేన్ బేగ్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఇస్మాయిల్ బేగ్, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ, నేతలు గంజి చిరంజీవి, పర్వతం మధుసూదనరావు, అడపా మాణిక్యాలరావు, బడే కోమలి, మునగపాటి మారుతీరావు, సామల నాగేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక దువాలో పాల్గొన్న జనసేన, మైనార్టీ నాయకులు

స్టేట్ క్యారెమ్స్‌లో ప్రత్తిపాడు యువకుడి ప్రతిభ

● ప్రథమ స్థానంలో నిలిచిన బాపతు రవీంద్రారెడ్డి

ప్రత్తిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర స్టేట్ ఫస్ట్ ర్యాంకింగ్ క్యారమ్ టోర్నమెంట్‌లో ప్రత్తిపాడుకు చెందిన యువకుడు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ నెల 11వ తేదీన విశాఖపట్నంలో స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పురుషులు, స్త్రీల విభాగంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సింగిల్స్ విన్నర్‌గా ప్రత్తిపాడుకు చెందిన బాపతు రవీంద్రారెడ్డి నిలిచారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా నిలిచిన రవీంద్రారెడ్డికి స్టేట్ క్యారమ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నీరజ్‌కుమార్ సంపతి, జనరల్ సెక్రటరీ అబ్దుల్ ఖలీల్ చేతుల మీదగా జ్ఞాపికతో పాటు ప్రసంసా పత్రాన్ని అందజేశారు. స్థానిక క్యారమ్ బోర్డు కార్యాలయం నందు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ పెద్దలు రవీంద్రారెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. సీనియర్ ప్లేయర్స్ వాసన శివాజి ఐదు వేల రూపాయల నగదు బహుమతిని అందజేశారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందడం ప్రత్తిపాడుకు గర్వ కారణమన్నారు. ఇప్పటికే ప్రత్తిపాడు నుంచి గతంలో అనేక మంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీ పడి బహుమతులు అందుకున్నారు.

సీఆర్డీఏకి అవసరమైనప్పుడు తొలగిస్తాం

● అందాక జీవనోపాధి పొందనివ్వండి .. చిరువ్యాపారుల వినతి

తుళ్లూరు, మే 13(ఆంధ్రజ్యోతి): సీఆర్డీఏకి ఎప్పుడు అవసరమైతే అప్పుడు బడ్డీకొట్లు ఖాళీ చేస్తామని, అందాక జీవనోపాధి పొందనివ్వాలని చిరు వ్యాపారులు సీఆర్డీఏ అధికారులకు విన్నవించారు. మంగళవారం సీఆర్డీఏ అధికారులు చిరువ్యాపారుల బడ్డీకొట్లు తీయటానికి జేసీబీతో, పోలీసు బందోబస్తుతో వచ్చారు. టెంపులకు కేటాయించిన స్థలంలో చిరు వ్యాపారుల కొట్లు లేవని, నిర్మాణానికి ఎటువంటి ఇబ్బందులు కలగవని, ఎందు కు తొలగిస్తున్నారో చెప్పాలని సీఆర్డీఏ తహసీల్దార్ రవిబాబును తెలుగుయువత మండల అధ్యక్షుడు మూల్పూరి నరేష్ నిలదీశారు. సీఆర్డీఏకి అవసరమైనప్పుడు చిరు వ్యాపారులు ఖాళీ చేస్తారని తెలుగుయువత సభ్యులు హామీనిచ్చారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి శ్వేత

పెదనందిపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని పంచాయతీ కార్యదర్శి శ్వేత తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. గ్రామానికి వరగాని చెరువు నుంచి తాగునీరు రావడం లేదని దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ మేరకు ప్రత్యేక సమావేశం నిర్వహించి తీర్మానం చేసినట్లు తెలిపారు. ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి సంపులో నింపి కొళాయిల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. గ్రామస్థులు తాగునీటిని వృథా చేయరాదని, వేసవి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి పద్మారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ముగిసిన బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

తెనాలిరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కఠెవరంలో ఈ నెల 7నుంచి ప్రారంభమైన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు స్వామివారికి మహానైవేద్యం నివేదించిన అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వేలాదిగా భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆత్మానంద సేవా సమితి సభ్యులు, ఏడుకొండలరాజు, శ్రీనివాసరాజు, వెంకమరాజు, మాజీ సర్పంచ్ గంపల శివ నాగేశ్వరరావు, కె.నరసరాజు, సిద్ధంరాజు, మాలకొండమరాజు, శ్రీనివాసరాజు, కృష్ణంరాజు, నారంరాజు, గోపికృష్ణంరాజు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడు కొలకలూరులో వైద్య శిబిరం

తెనాలిరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని జూబ్లీ స్కూల్‌లో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్‌హోప్ ఆధ్వర్యంలో దుగ్గిరాల ఫ్రెండ్స్ ఫౌండేషన్ సహకారంతో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలవరకు నిర్వహించే శిబిరంలో షుగర్, బీపీ, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆయాసం, కంటి, దంత సంబంధిత సమస్యలపై వైద్యులు పరీక్షించి మందులు అందజేస్తారని సంస్థ నిర్వాహకులు తెలిపారు. అలాగే గర్భిణులు, చిన్న పిల్లలకు కూడా చికిత్స అందిస్తామన్నారు. కొలకలూరు, పరిసర ప్రాంత ప్రజలు ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల కోరారు.

20న జరిగే సార్వత్రిక సమ్మెకు నోటీసులు

తెనాలి అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ కోరారు. కార్మికులతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం సమ్మె నోటీసులు అందజేశారు. గ్రామ, వార్డు, ఆరోగ్య కార్యదర్శుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నందులపేట, మారీసుపేట, వైద్యశాలల్లో సమ్మె నోటీసులు అందజేశారు. లేబర్ కోడ్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.20వేలు చేయాలని, 29కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, పని భారం తగ్గించాలని కోరారు. హుస్సేన్‌వలి, శ్యామల, సుమిత్ర, పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో సార్వత్రిక సమ్మె జయప్రదం చేసేందుకు కార్మిక సంఘాలతో సమీక్ష నిర్వహించారు.

సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: ఈవోపీఆర్డీ భార్గవ్

కొల్లిపర, మే 13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈవోపీఆర్డీ భార్గవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్వచ్ఛ సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పంచాయతీ సిబ్బందికి స్వచ్ఛ సంపద తయారీపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ స్వచ్ఛ సంపద ప్రధాన్యతను ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. రోడ్ల పక్కన చెత్తచెదారం లేకుండా చూచుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆలకనంద, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూలీలు సమయపాలన పాటించాలి: ఏపీవో వెంకయ్య

కొల్లిపర, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కూలీలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఏపీవో వెంకయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, చివలూరు తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ కూలీలు ఉష్ణోగ్రతలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించినట్లు తెలియజేశారు. కూలీలకు కొలతలు బట్టి వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు వల్లభాపురం బుజ్జిబాబు, కనపర్తి సాగర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



రహదారిపై పూడ్చిన గుంత

గొయ్యి పూడ్చివేత

తెనాలి అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): గంగానమ్మపేట నాళం వారి వీధిలో నెల రోజుల క్రితం తవ్వి వదిలేసిన గొయ్యిని మున్సిపల్ సిబ్బంది మంగళవారం పూడ్చారు. రోడ్డు తవ్వి వదిలేశారు శీర్షికన మంగళవారం వెలువడిన కథనానికి వారు స్పందించారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందులు తీరాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

కొలకలూరులో యువకుల మధ్య ఘర్షణ

తెనాలి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలకలూరులో మంగళవారం రాత్రి యువకుల మధ్య ఘర్షణ జరిగింది. గ్రామంలోని వాటర్ ట్యాంక్ వద్ద కొందరు యువకులు గ్రూపులుగా ఒకరిపై మరొకరు దాడిచేసుకున్నారు. ఈ దాడిలో పలువురికి తీవ్రగాయాలైనట్లు సమాచారం. దీనిపై పూర్తి వివరాలు తెలియరాలేదు.

అక్రమాలకు కేరాఫ్ వైసీపీ నాయకుడు

- వైసీపీ నాయకుడి దౌర్జన్యంతోనే కౌలు రైతు ఆత్మహత్య
- బర్నబాసు హత్య కేసులోనూ నిందితుడు
- మొక్కజొన్న, జొన్న విక్రయాల్లో భారీగా అక్రమాలు

వైసీపీ నాయకుడు వీరయ్య చౌదరి (పిల్ల చౌదరి) అక్రమాల చిట్టా రోజు రోజుకు పెరిగిపోతోంది. 2019-2024 మధ్య వైసీపీ హయాంలో వీరయ్య చౌదరి చేయని అక్రమాలు లేవు. అధికారం అండమాటున సాగించని దౌర్జన్యం లేదు. పొన్నూరులో రేషన్ అతని కనుసన్నల్లోనే సాగింది. సన్నకారు రైతులకు అధిక వడ్డీలకు అప్పు ఇచ్చి.. వాటి వసూళ్ల విషయంలో నిర్దయగా వ్యవహరించడం అతని నైజం. నన్నపనేని వీరయ్యచౌదరి వైసీపీ నాయకుడు, అప్పటి ప్రజాప్రతినిధి అండతో నిడుబ్రోలును అరాచకాలకు అడ్డాగా మార్చి వేశాడు. బర్నబాసు అనే బియ్యం వ్యాపారి హత్య నుంచి తాజాగా కౌలురైతు తన్నీరు శ్రీనివాసరావు బలవన్మరణం వరకు ఈ వ్యక్తి ప్రమేయం కనిపిస్తోంది.

పొన్నూరు టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో అత్యంత కీలకమైన ప్రాంతం నిడుబ్రోలు. కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతం గత 30 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీని ఆదరించింది. 2019లో టీడీపీ ఓటమి పాలయినప్పటికి నిడుబ్రోలు ప్రాంతంలో మెజార్టీ టీడీపీకే వచ్చింది. తెలుగుదేశం పార్టీకి ప్రజాదరణ తగ్గించాలనే ఉద్దేశంతో నిడుబ్రోలులో చోటా మోటాగా ఉన్న నన్నపనేని వీరయ్యచౌదరిని (పిల్ల చౌదరి) వైసీపీ ప్రజా ప్రతినిధి చేరదీశాడు. ఆనాటి నుంచి వీరయ్య చౌదరి హవాకు తిరుగులేకుండా పోయింది. నిడుబ్రోలులోని కీలక టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి బెదిరింపులకు పాల్పడడంతో ప్రారంభం అయిన హవా క్రమంగా పెరిగిపోయింది. ఈ క్రమంలో నిడుబ్రోలు సొసైటీ అధ్యక్షుడిగా వీరయ్య చౌదరి నియమితులయ్యాడు. సొసైటీలో బోగస్ రుణాలు, రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడ్డాడనే పెద్దఎత్తున ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సన్నకారు రైతులకు సాగు పెట్టుబడి కింద అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చేవాడు. బినామీలతో ఇచ్చిన అప్పుల వసూళ్లకు నిర్దయగా వ్యవహరించడం, అప్పులు చెల్లించలేని రైతులు ధాన్యం, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న కారు చౌకగా కొట్టేసి.. తిరిగి అదే రైతుల పేరుతో కొనుగోలు కేంద్రంలో మద్దతు ధరకు విక్రయించి, రెండు విధాలా లాభపడ్డాడు. ఇతని అక్రమాల పర్వంపై తెలుగుదేశం పార్టీ గతంలో పలుమార్లు పోరాటంచేసి విచారణ జరపాలని ప్రభుత్వానికి ఫిర్యాదులు సైతం అందజేసింది.

రేషన్ మాఫియాకు దిక్సూచి

వైసీపీ ప్రభుత్వం హయాంలో వీరయ్య చౌదరి పొన్నూరు ప్రాంతంలో రేషన్ మాఫియాకు దిక్సూచిగా మారాడు. పొన్నూరులో 2019-2024 మధ్య కాలంలో రేషన్ మాఫియా రాజ్యమేలింది. సాక్షాత్తూ అప్పటి ప్రజా ప్రతినిధి ప్రోత్సాహంతో వీరయ్య చౌదరి కనుసన్నలలోనూ రేషన్ మాఫియా వ్యవహారాలు సాగాయి. నెలవారీ మామూళ్లు సైతం వీరయ్య చౌదరి ద్వారానే ప్రజా ప్రతినిధికి చేరేవని ఆరోపణలు ఉన్నాయి. ముడుపుల వ్యవహారంలో తేడాలు రావడంతో పొడచూపిన విబేధాల నేపథ్యంలో దళితుడైన బియ్యం వ్యాపారి అంజి బర్నబాసు అనే వ్యక్తి హత్య జరిగింది. ఈ హత్య రాష్ట్రంలోనే పెను ప్రకంపనలకు దారి తీసింది. ఈ హత్య కేసులో వీరయ్య చౌదరి 11వ నిందితుడిగా ఉన్నాడు. ఈ హత్య అనంతరం పోలీసుల విచారణపై తీవ్ర ఒత్తిడి రావడంతో చౌదరి విదేశాలకు పలాయనం చిత్తగించేందుకు ప్రయత్నించాడు. ప్రజా ప్రతినిధి ఒత్తిడితో వీరయ్య చౌదరి వైపు పోలీసులు కన్నెత్తి చూడలేదు. పోలీసులు ఉదాసీన వైఖరితో చౌదరి కోర్టుకు వెళ్లి బెయిల్ తెచ్చుకున్నాడు. ఈ కేసులో ముద్దాయిలు అందరిపై రౌడీషీట్‌లు తెరిచినా.. పోలీసులు వీరయ్య చౌదరిపై షీట్ ఓపెన్ చేయడానికి సాహసించలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ఓ రేషన్ మిల్లర్ సాయంతో అప్పులు తీసుకున్న సన్నకారు రైతుల ధాన్యంను కారు చౌకగా కొని, మద్దతు ధరకు ప్రభుత్వానికి అమ్మి కోట్లు సంపాదించాడనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా వడ్డిముక్కల గ్రామానికి చెందిన సన్నకారు రైతు తన్నీరు శ్రీనివాసరావుకు ఇచ్చిన అప్పు చెల్లించకపోవడంతో బలవంతంగా ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురైన తన్నీరు శ్రీనివాసరావు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వైసీపీ ప్రభుత్వ హయాం లో అధికారం అండతో చెలరేగిన చౌదరి కూటమి ప్రభుత్వంలో కూడా అరాచకాల పర్వం సాగిస్తుంటే పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం స్పందించి వీరయ్య చౌదరి అరాచకాలను అడ్డుకట్ట వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం

- సబ్ కలెక్టర్ సంజన సింహ


సమావేశంలో మాట్లాడుతూన్న సబ్‌కలెక్టర్ సంజన సింహ పక్కన కమిషనర్ శేషన్న, తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు

తెనాలి, మారీసుపేట,మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 17న నిర్వహించనున్న స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని సబ్ కలెక్టర్ సంజన సింహ అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధ్యక్షతన సబ్ కలెక్టర్ సంజన సింహ, తహసీల్దార్ గోపాలకృష్ణ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. పలు శాఖల అధికారులు, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులకు బీట్ ది హీట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ సంజన సింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో జయప్రదం చేద్దామన్నారు. అందులో భాగంగా ప్రతినెల మూడో శనివారం నాడు క్లీన్ గ్రీన్, ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా ఉంచటంలో భాగంగా జనవరిలో స్వచ్ఛాంధ్ర దినోత్సవం, ఫిబ్రవరి నెలలో సోర్స్ రీసోర్స్ కార్యక్రమం, మార్చిలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేద దినోత్సవం, ఏప్రిల్‌లో ఇ వ్యర్థాలను నిషేధించే కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ మే నెల 17న బీట్ ది హీట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అన్ని విభాగాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర స్వచ్ఛత తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్‌నిర్మల ఆర్‌వో ఎం రాంప్రసాద్, టూటౌన్ సీఐ రాములనాయక్, ఎలక్ట్రికల్ ఏడీఈ అశోక్‌కుమార్, ఇండియన్ టుబాకో కంపెనీ డిప్యూటీ మేనేజర్ ఉమాకాంత్, ఆల్‌లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, కిరాణా మర్చంట్ అసోసియోషన్ సభ్యులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులకు పలు సూచనలు చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక తదితరులు

పంట కాలువలో సిల్ట్‌ను తొలగించండి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని ప్రధాన పంట కాలువలోని సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో అన్నారు. మంగళవారం స్థానిక కొత్తపేటలోని 7వ వార్డులో చిట్టిఆంజనేయ స్వామివారి గుడి దగ్గర నుంచి గురవయ్య కాలనీ వరకు ఉన్న జంపని పంట కాలువలోని పూడికతీత పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత పనులకు స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టామన్నారు. పంట కాలువలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించి వాటిని డంపింగ్ యార్డులకు తరలించాలని ఆదేశించామన్నారు. అనంతరం పూలేకాలనీ వాసులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తదనంతరం పట్టణంలో 1, 40వ వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి శానిటరీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పొట్టి శ్రీరాములు మున్సిపల్ పార్కు, లైబ్రరీ, కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించి వాటిలో అవసరమైన పనులను చేపట్టాలని మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ ఏఈ సూరిబాబు, టీపీవో సాంబశివరావు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


తైవాన్ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

రైతుల సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం

- ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు

పొన్నూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పాటుపడుతోందని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని దొప్పలపూడిలో మంగళవారం రైతులకు యంత్ర పరికరాలు, పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రు.10.15లక్షల ప్రభుత్వ రాయితీతో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదేశాలతో యంత్ర పరికరాల పంపిణీ చేశారు. ఇందులో 43 తైవాన్ స్ప్రేయర్లు, 7 వెద గొర్రులు, 9గొర్రులు, పల్టీ నాగళ్లు 1, రోటోవేటర్, పవర్ టిల్లర్, లెవెలింగ్ బ్లేడ్ మొత్తం 63యంత్ర పరికరాలను దొప్పలపూడి రైతు సేవా కేంద్రం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీవో వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ భూసారాన్ని పెంపొందించుకునేందుకు 50శాతం రాయితీపై జీలుగ, జనుము విత్తనాలు సిద్ధం చేసినట్లు తెలిపారు. 58 క్వింటాళ్ల జీలుగ, 40క్వింటాళ్ల జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, 300క్వింటాళ్ల జీలుగ, 140 క్వింటాళ్ల జనుము విత్తనాలు కావాల్సి ఉందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. ఏవో దేగల వెంకట్రామయ్య, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబురావు, పార్లమెంట్ రైతువిభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, సాగునీటి సంఘం డీసీ చైర్మన్ గనిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకట్రావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న లలిత

తెనాలి అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): చెంచుపేటలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. బాలురు, బాలికల విభాగంలో జూనియర్, సీనియర్ పోటీలు నిర్వహించారు. బాలికల జూనియర్ పోటీలలో నిత్య-తేజస్విని, భావన-రష్మిక, సీనియర్స్‌లో దుఖిత్-ఉషశ్రీ, టిమ్సీ-సాత్విక, బాలుర సబ్ జూనియర్స్‌లో దర్శిక్-భార్గవ్, సందీప్-ఫణిత్, జూనియర్స్‌లో జిషాన్‌బేగ్-అభిషేక్, వంశీధర్-కార్తీక్, సీనియర్స్‌లో జ్యోతిష్-విజయకృష్ణ, సత్య-లశ్విత్ జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు రవిశంకర్, సాయిలలిత, నాగరాజు, సాయిచరణ్, శ్రీమన్నారాయణ, వినయ్‌కుమార్‌లు బహుమతులు అందజేశారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ వీరనారాయణ

సీబీఎస్‌ఈ ఫలితాల్లో వివేకానంద విద్యార్థుల ప్రతిభ

తెనాలి అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ పరీక్ష ఫలితాల్లో వివేకానంద సెంట్రల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ అభినందించారు. పదో తరగతిలో షేక్ ఆరిఫున్నీసా బేగం 500 మార్కులకు గాను 489, జవ్వాజి లిఖిత, కార్తీక్, చంద్రహాసిని 95శాతం, లక్ష్మిసుజాత, మనోహర్, రాజేంద్ర, పసిరున్నీసా 92శాతం సాధించారని తెలిపారు. విద్యార్థులంతా 60 శాతం పైగా మార్కులతో ఉత్తీర్ణులయ్యారని ఆయన చెప్పారు. 12వ తరగతి సీబీఎస్‌ఈ పరీక్షల్లో కూడా విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ఎంపీసీలో దేవి కాసాయి 94 శాతం, బైపీసీలో కొడాలి శ్రీఅంజన 93.6 శాతం మార్కులు సాధించినట్లు వివరించారు. ఈడీ రామరాజు, వెంకటరత్నం, సీఈవో వెంకట్రామ్, ఉదయ్‌కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి: శివసాంబిరెడ్డి

తెనాలిరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు ఉపాధి హామీ పథకం కూలీలు మద్దతు తెలిపి జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని గుడివాడలో ఉపాధి పథకం కూలీలను కలిసిన సమ్మె డిమాండ్లను వారికి వివరించారు. పలువురు రైతుసంఘం నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

సహజ పద్ధతిలో తెల్లదోమ నివారణ

తెనాలిరూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): పైర్లు లేత చిగుళ్ల దశలో ఉన్నప్పుడు తెల్లదోమ ఉధృతి నివారణకు.. రసాయనాలకంటే పసుపు అంటుకున్న ఉచ్చులు (యల్లో స్టిక్ ట్రాప్స్) ఎంతోగానో ఉపయోగపడతాయని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం బాపట్ల కళాశాల విద్యార్థులు తెలిపారు. మంగళవారం మండలంలోని కఠెవరంలో తెగుళ్ల నియంత్రణకు సేంద్రియ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, రాము. శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు: పున్నారెడ్డి

తెనాలి, మారీసుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వసతి గృహాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని పట్టణ ఇన్‌చార్జి సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కొత్తపేట, నాజరుపేట, రామలింగేశ్వర పేట, ఐతా నగర్‌లోని ప్రభుత్వ వసతి గృహాల్లో మలాథియాన్‌ను పిచ్చికారి చేయించామన్నారు.


మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వ్యాపారులు

మురళీనాయక్‌కు ఘన నివాళి

తెనాలి అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుడు మురళీనాయక్‌కు మెయిన్ రోడ్డులో దుకాణదారులు నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి పలికారు. కొవ్వొత్తులు వెలిగించి అమర జవాన్‌కు ఆత్మకు శాంతి చేకూరాలంటూ ప్రార్థనలు చేశారు. శ్రీమన్నారాయణ, కడియాల శ్రీను, పూర్ణ, బాబు నాయక్, శివ, కిషోర్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సర్వీసు రూల్స్ విడుదల చేయాలి

- ఫెడరేషన్ అధ్యక్షుడు సోమరౌతు శ్రీనివాసరావు

తెనాలి అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా యూనిట్‌గా మున్సిపల్ టీచర్ల సర్వీసు రూల్స్ విడుదల చేయాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సోమరౌతు శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌తో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశామని తెలిపారు. మున్సిపల్ టీచర్ల పరిపాలన, పర్యవేక్షణ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కే అప్పగించారని తెలిపారు. గత నవంబరులో ఇచ్చిన పదోన్నతుల స్థానాలను బదిలీల్లో చూపాలన్నారు. మున్సిపల్ టీచర్ల అంతర్ బదిలీలు చేపట్టాలని కోరారు. మున్సిపాలిటీలలో గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయుల పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటుతో పట్టణంలో ప్రాథమిక పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు.

ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలి

- మండల వైద్యాధికారి సుమంత్


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కొల్లిపర, మే 13 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అన్నవరం గౌడపాలెంలో వైద్యాధికారులు ఫామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్థులు వైద్యుల సలహాలు, సూచనల మేరకు ప్రతిరోజు మందులను వాడుకోవాలన్నారు. ప్రతి నెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్నవారికి కూడా ఇంటికి వెళ్ళి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, మేరిమ్మ, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు పాల్గొన్నారు.


చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంగలకుదురుకు చెందిన షేక్ మీరావలి (45) ఈ నెల 11న గుంటూరు నుంచి అంగలకుదురు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. అంగలకుదురు శివారులో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్రగాయాలతో ఉన్న మీరావలిని తోటి ప్రయాణికులు గమనించి 108 ద్వారా తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో చక్రస్నానం

పొన్నూరు టౌన్, మార్చి, 13 (ఆంధ్రజ్యోతి): సాక్షిభావన్నారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చక్రస్నానం భక్తిశ్రద్ధలతో సాగింది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం ఆలయంలో వసంతోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీసుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత సాక్షిభావన్నారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వసంతోత్సవ వేడుకలకు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సంప్రదాయ రీతిలో వసంతోత్సవం నిర్వహించి ఉత్సవమూర్తులకు అభిషేకాలు జరిపారు. ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మసరోవరంలో శ్రీచక్రతాళ్వార్‌లు చక్రస్నానం నిర్వహించారు. చక్రస్నానానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరై స్నానాలు ఆచరించి వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


దాతను సన్మానిస్తున్న ఆలయ ఉద్యోగులు

పెదకాకాని, మే 13 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి 1లక్ష రూపాయలు విరాళాన్ని దాతలు అందజేసినట్లు ఆలయ ఉప కమిషనర్ లీలాకుమార్ తెలిపారు. పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడుకు చెందిన బైరపనేని జయమ్మ జ్ఞాపకార్థం భర్త బైరపనేని నరసింహారావు, కుమారులు సీతారామయ్య, మల్లికార్జునరావు మంగళవారం దేవస్థాన నిత్య అన్నదాన పథకంనకు విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళాలు అందించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఉప కమిషనర్ భక్తులకు విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఎం సాంబశివరావు తదితరులు

సీబీఎస్‌ఈ ఫలితాల్లో ప్రోడిజి విద్యార్థుల ప్రతిభ

గుంటూరు (విద్య) మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బుడంపాడులోని ప్రోడిజి విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని డైరెక్టర్ ఎం.సాంబశివరావు మంగళవారం తెలిపారు. పరీక్షకు మొత్తం 28 మంది హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత సాధించారని వెల్లడించారు. ఇందులో ఎ.రామ్‌చరణ్ 96శాతం వై.భవిష్య 95శాతం, ఎస్ కే హఫీజ్ 94 శాతం మార్కులతో అగ్రస్థానంలో నిలిచారని వెల్లడించారు. విద్యార్థులను ప్రిన్సిపల్ వై.రజిని చౌదరి కార్యదర్శి ఎం.సూర్యకుమారి తదితరులు అభినందించారు.